
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు


జిల్లా వార్తలు

5

శనివారం 15 ఫిబ్రవరి 2025

నిధుల్లేకుండా..

ఏర్పాట్లు ఎలా?



8

- ఈవో లేఖ రాసినా స్పందించని ప్రభుత్వం
- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- పది రోజుల్లో మహా శివరాత్రి ఉత్సవాలు
- కోటప్పకొండ తిరునాళ్లపై చేతులెత్తేస్తున్న అధికారులు

దేవస్థానం వద్ద ఉచిత దర్శనం క్యూలైన్‌లకు తాటాకు పందిరి వేస్తున్న దృశ్యం

వ్యర్థాల నుంచి విముక్తి



- ప్రభుత్వ ఆస్పత్రులకు మార్గదర్శకాలు జారీ
- ఆస్పత్రుల్లో గుట్టలుగుట్టలుగా బయో వ్యర్థాలు
- 45 రోజుల్లో పనికిరాని వాటిని గుర్తించి వేలం

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ఉపయోగంలో లేని, పనికిరాని వైద్య పరికరాలు, సామగ్రి, ఇతర వస్తువులు భారీగా పేరుకు పోవడంతో స్థలం కొరతతో ఇబ్బం దులు పడుతున్న గుంటూరు ప్రభుత్వాస్పత్రికి ఊరట లభించ నుంది. జీజీహెచ్‌లో ఎక్కడ చూసిన గుట్టలుగా పేరుకుపోయిన ఐరన్ స్క్రాప్ దర్శనమిస్తుంది. ఇలాంటి పనికిరాని ఐరన్ ఫర్నీచర్ నిల్వలతో ఎదురవుతున్న సమస్యల్ని సమీక్షించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ వాటిని వదిలించుకునేందుకు నూతన మార్గదర్శ కాల్ని గురువారం ప్రకటించింది. ఇప్పటి వరకు అమలులో ఉన్న నిబంధనల మేరకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడిసి)కి చెందిన బయో మెడికల్ ఇంజనీర్లు వ్యర్థ పదార్థాల్ని నిర్ధారించి వాటిని వేలం ద్వారా విక్రయించుకోవడానికి(డిస్పోజల్) నివేదికలు ఇస్తేనే ప్రభుత్వాస్పత్రులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ బయోమెడికల్ ఇంజనీర్ల కొరతతో ఈ దిశగా వ్యర్థాల్ని వదిలించుకునే ప్రయత్నాలు చేయలేదు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్) ద్వారా ఈ వ్యర్థాల్ని వదిలించుకోవాలన్న నిబంధన ఉంది. ఈ విషయంలో సీఎస్ఐఆర్ సహకారం కొరవడడంతో వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి.

ఈ అవరోధాల్ని గమనించిన వైద్య ఆరోగ్య శాఖ, వ్యర్థాల డిస్పోజ్‌కు సంబంధించిన నియామాల్లో (మిగతా 6వ పేజీలో)



స్వచ్ఛతకు.. ర్యాంకులు

- విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 14 సూచకలు.. 200 పాయింట్ల ఆధారం
- 117 పాయింట్లతో గుంటూరుకు 8వ ర్యాంకు
- 115 పాయింట్లతో 9వ స్థానంలో బాపట్ల జిల్లా
- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో వెనకబడిన పల్నాడు..
- ఇంటింట చెత్త సేకరణ, కార్యాలయాల శుభ్రతపై నేడు కార్యక్రమం

గుంటూరు సిటీ, బాపట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆయా కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన.. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర మిషన్‌కు శ్రీకారం చుట్టింది. ప్రతి నెలా మూడో శనివారం ప్రత్యేక థీమ్‌ను ఎంచుకుని ప్రభుత్వ సిబ్బందితో పాటు ప్రజలను, విద్యార్థులను భాగస్వాములను చేసి అత్యంత శుభ్రత కలిగిన జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిన సంగతి తెలిసిందే. ఇందుకు అనుగుణంగా మార్గదర్శకాలను రూపొందించిన ప్రభుత్వం వాటిని యంత్రాంగం తప్పనిసరిగా పాటించాల్సిందేననే ఆదేశాలు జారీ చేసింది. మొత్తం 14 సూచకలకు అంశాల వారీగా 200 పాయింట్లు కేటాయించింది. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్స్, డోర్ టు డోర్ కలక్షన్, చెత్త నిర్వహణ, విభజన, కమ్యూనిటీ సోక్ పిట్స్, క్లీన్ విలేజ్, ఒడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్ వంటి అంశాలతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని తొలివిడతలో భాగంగా మూడో శనివారమైన జనవరి 18న ప్రభుత్వం చేపట్టింది. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం, పరిశుభ్రమైన వాతావరణం, విద్యార్థులకు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై అవగాహన కల్పించడం ఇందులో ఉన్నాయి. వీటి ఫలితాలతో పాటు జిల్లాలో ఆ కార్యక్రమం అమలుకు మార్కులతో పాటు ర్యాంకులను శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో గుంటూరు జిల్లా మెరిసింది. పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖలు చేపట్టిన కార్యక్రమాలలో జిల్లాకు రాష్ట్ర వ్యాప్తంగా 8వ ర్యాంకు వచ్చింది. 14 సూచక(ఇండికేటర్స్)ల్లో జిల్లాకు 117 పాయింట్లు దక్కాయి. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో గుంటూరు జిల్లా తర్వాత స్థానం బాపట్లకు దక్కింది. 14 ఇండికేటర్స్‌లో బాపట్ల జిల్లాకు 115 పాయింట్లతో 9వ స్థానం నిలిచింది. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల పురోగతిలో పల్నాడు జిల్లా వెనకబడింది. ఈ జిల్లాకు 14 ఇండికేటర్స్‌లో 103 పాయింట్లు రాగా 20వ ర్యాంకుకు పరిమితమైంది.

నేడు మరో కొత్త థీమ్‌తో..

ప్రతి నెలలో మూడో శనివారం స్వచ్ఛాంధ్ర మిషన్ కార్యక్రమాన్ని సరికొత్త థీమ్‌తో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా నేడు (శనివారం) సరికొత్త థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణతో పాటు చెత్త నుంచి సంపద సృష్టి, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేయడం ఈ థీమ్‌లో ప్రముఖంగా చేర్చారు. జిల్లాల పరిధిలోని అన్ని విభాగాల అధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరగను న్నాయి. ప్రజలు, విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. ప్రతి విభాగానికి ఓ నోడల్ అధికారిని నియమించి పర్యవేక్షణ బాధ్యతలను వారికి అప్పగించి ఫలితాల విషయంలో వారిని జవాబుదారీవహించే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

యజ్ఞంలా స్వచ్ఛాంధ్ర



పంచాయతీరాజ్ శాఖతో పాటు మిగిలిన అన్ని శాఖలను కలుపుకుని ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం యజ్ఞంలా నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన 14 సూచకలు అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందించి ఆ ప్రకారం ముందుకు వెళ్తున్నాం. నెలలో మూడో శనివారం జరిగే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఉద్యోగి విధిగా పాల్గొని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, పని ప్రాంతాల్లో పరిశుభ్రతను పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలి. ప్రతి మండలం, నియోజకవర్గంలో జరిగే ఈ కార్యక్రమాలను ప్రత్యేక అధికారులు పర్యవేక్షిస్తారు.

- చొప్పర కృష్ణ, డిప్యూటీ సీఈవో, జిల్లా పరిషత్, గుంటూరు



సీఆర్డీఏకు సవాలు

రాజధాని అమరావతిలో పనులు ప్రారంభమవుతున్నాయి.. అయితే రాజధానిలో ఆ పనుల పర్యవేక్షించే సీఆర్డీఏకు ప్రత్యేకంగా కార్యాలయం ఇప్పటికీ సమకూరలేదు. కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించినా సీఆర్డీఏకు కార్యాలయ భవనం పనులు ఒక సవాల్‌గా మారాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన జరిగి.. పనులు తుది దశకు చేరుకున్నాయి. అయితే వైసీపీ ప్రభుత్వ నిర్వాకం తో సీఆర్డీఏకు కార్యాలయం లేకుండా పోయింది. రాజధాని అమరావతిపై కక్ష సాధింపు క్రమంలో సీఆర్డీఏ భవనాన్ని మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతి పనులపై దృష్టి సారించింది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చంద్ర బాబు సీఆర్డీఏ కార్యాలయ పనులకు పునః శంకుస్థాపన చేశారు. రెండు నెలల్లో అందుబాటులోకి కార్యాలయం వచ్చి కార్యకలాపాలు ప్రారంభించాలని ఆదేశించి ఇప్పటికి నాలుగు నెలలు అవుతోంది. అయితే వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో పనులు ఒక కొలిక్కి రావడం లేదు. పైగా అదనపు వ్యయంతో పాటు మాస్టర్ ప్లాన్ ప్రకారం నిర్మాణాలకు సమయం వృథా అవుతోంది.

రాజధానిలో కార్యాలయానికి మోక్షమెప్పుడో?



సీఆర్డీఏ కార్యాలయం, ఇన్‌సెట్లో పని చేస్తున్న కార్మికులు

- 2019లోనే తుది దశకు చేరినా వైసీపీ నిర్వాకంతో అస్తవ్యస్తం
- రెండు నెలల్లో అందుబాటులోకి వస్తుందన్నా.. పనుల్లో తీవ్రజాప్యం
- మాస్టర్‌ప్లాన్ ప్రకారం పనులకు అదనపు వ్యయం, సమయం వృథా

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీ సీఆర్డీఏ)దే కీలకపాత్ర. రాజధాని నిర్మాణానికి సంబంధించిన విధి, విధానాలన్నీ సీఆర్డీఏ పర్యవేక్షణలోనే ప్రాణం పోసుకుంటాయి. అమరావతి రూపురేఖలన్నీ ఇక్కడే రూపుదిద్దుకుంటాయి. అలాంటి కీలక సంస్థకు రాజధాని అమరావతిలో ఇప్పటికీ కార్యాలయం లేదు. 2014- 19 కాలంలోనే సీఆర్డీఏ కార్యాలయాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని భావించారు. అయితే ఇప్పటి వరకూ ఆ కార్యాలయం అందుబాటులోకి రాలేదు. అందుకు కారణం గత వైసీపీ ప్రభుత్వం నడిపిన కక్షా రాజకీయాలే. అమరావతిపై దుగ్ధతో నాటి జగన్ ప్రభుత్వం చేసిన విచ్ఛిన్నమే నేటికీ రాజధానిలో సీఆర్డీఏ కార్యాలయం లేకుండా పోవడానికి కారణమన్న విమర్శలు వస్తున్నాయి. నాడు జగన్ చేసిన విధ్వంసం, ఆ తాలూకూ విచ్ఛిన్నకర చర్యలే నేటికీ రాజధానిని వెంటాడుతున్నాయి. ఆ కారణంగానే సీఆర్డీఏ కార్యాలయ భవన నిర్మాణ పనులు అంతకంతకూ జాప్యమవుతున్నాయి.

పదేళ్ల క్రితం సీఆర్డీఏ ఏర్పాటు

సీఆర్డీఏను 2014 డిసెంబరు 30న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాజధాని నిర్మాణ ప్రక్రియ మొత్తం సీఆర్డీఏ పర్యవేక్షణలో జరగనున్న నేపథ్యంలో సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన రావిపూడిలో కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 3.62 ఎకరాల్లో ఏడు అంతస్తులు, 2.42 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో కార్యాలయ భవన నిర్మాణం చేపట్టారు. కార్యాలయం చుట్టూ 2.5 ఎకరాల్లో ఉద్యానవనం ఏర్పాటుకు పూనుకున్నారు. 2017లో రూ.160 కోట్ల అంచనాలతో సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయానికి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చే నాటికి భవనం ఏడంతస్తులు స్లాబ్ వరకూ పూర్తి అయింది. ఫినిషింగ్, ఇంటీరియర్, విద్యుత్, తదితర పనులు మాత్రమే పెండింగులో ఉన్నాయి. 80 శాతం పూర్తయిన ఆ పనులను జగన్ సీఎంగా ప్రమాణం చేసిన వెంటనే ఆపేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు ఆర్బీఐ కార్యాలయం ఏర్పాటుకు ఈ భవనాన్ని సూచించగా, అందుకు వారు అంగీకరించలేదు. బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ఆ కార్పొరేషన్లకు కావాల్సిన కార్యాలయాలను ఏర్పాటు చేయడానికి ఈ భవనాన్ని వాడుకోవాలని భావించారు. ఈ క్రమంలో సీఆర్డీఏ కార్యాలయ భవననమూనాను మార్చి 2023 కొత్తగా నిర్మాణాలు చేపట్టారు. ఇప్పుడు ఆనిర్మాణాలే తలనొప్పిగా మారాయి.



సీఆర్డీఏ కార్యాలయం నిర్మాణ సామగ్రిని చేరవేస్తున్న కూలీలు

నాలుగు నెలలు ఆగాల్సిందేనా?

తుది దశకు చేరిన సీఆర్డీఏ కార్యాలయ భవనాన్ని వైసీపీ హయాంలో ఇష్టం వచ్చినట్లుగా మార్చేశారు. అరకొర పనులే మిగిలాయి వాటిని పూర్తి చేసి రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావించారు. అయి తే పనులు చేపట్టిన తర్వాత చూస్తే మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా జరిగిన పనులను తొలగించడం పెద్ద తలనొప్పిగా మారింది. అస్తవ్యస్త నిర్మాణాల తొలగింపు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికే రూ.5 కోట్లకు పైగా ఖర్చు చేశారు. అయితే ఇంకా అంతకు మించి ఖర్చు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. నిర్విరామంగా పనిచేసినా మరో నాలుగు నెలల వరకూ కార్యాలయం అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

ప్లాన్‌ను సరిదిద్దలేక పాట్లు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజధాని అమరావతి నిర్మాణంపై దృష్టి (మిగతా 8వ పేజీలో)

- ముగ్గురు డిప్యూటీ డీఈవోల నియామకం 6
- విజయపురిసౌత్ రేంజ్ పరిధిలో 5 పులుల గుర్తింపు 8
- 21, 22 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లు 8

అట్టహాసంగా రంగస్థలి

వార్షికోత్సవం

అలరించిన ఇంద్రప్రస్థం, పక్కింటి మొగుడు నాటికలు



నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రంగస్థలి 45వ వార్షికోత్సవం, 24వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు శుక్రవారం స్థానిక భువనచంద్ర టౌన్‌హాల్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సమితి, నరసరావుపేట రంగస్థలి సంయుక్త నిర్వహణలో ప్రజాకళాకారుడు దివంగత గద్దర్ కళాప్రాంగణంలో పోటీలను రంగస్థలి శాశ్వత సభ్యుడు కంజుల విశాలాక్షి జగన్మోహనరెడ్డి ప్రారంభించారు. తొలి ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటికను ప్రదర్శించారు. ప్రేమ అనేది సృష్టిలో గొప్పదే కాని ఆ ప్రేమలు హర్షించేలా ఉండాలి తప్ప అనాలోచితంగా వెర్రితలలు వేస్తే జీవితపు విలువలు నాశనం అవుతాయన్న సందేశంతో కూడిన నాటిక అందరినీ ఆలోచింపచేసింది. స్నిగ్ధ రచించిన ఈ నాటికకు ఎన్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. పండు క్రియేషన్స్, కొప్పోలు వారి పక్కింటి మొగుడు నాటిక ద్వితీయ ప్రదర్శనగా సాగింది. ఇతరుల అవసరాలను అవకాశంగా తీసుకుని ఎదుటివారిన బ్లాక్‌మెయిల్ చెయ్యడం తప్పని దురాశపరులైన ఓ జంటకు బుద్ధి చెప్పడమే ఇతివృత్తంగా సాగిన నాటిక హాస్యాన్ని పండించింది. ఈ నాటికను గోవిందరాజుల నాగేశ్వరరావు రచించగా, బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో రంగస్థలి ఫైనాన్స్ కమిటీ చైర్మన్ కపలవాయి విజయకుమార్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు చంద్రానాయక్, డాక్టర్ రామలింగారెడ్డి, జి.అలెగ్జాండర్ సుధాకర్, దొడ్డా రఘురామిరెడ్డి, చైతన్య కళాశాల డీన్ కె.రవీంద్రకుమార్ పాల్గొన్నారు.



కార్యక్రమాలను ప్రారంభిస్తున్న రంగస్థలి కార్యవర్గ సభ్యులు

గారపాడులో ఉద్రిక్తత.. పికెట్

- ఆలయం వద్ద పనులపై వివాదం
- వైసీపీ, టీడీపీ నేతల మధ్య వాదోపవాదాలు
- ఇరు వర్గాలకు సర్ది చెప్పిన డీఎస్పీ

పెదకూరపాడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆలయం వద్ద పనుల విషయంలో శుక్రవారం తలెత్తిన వివాదం మండలంలోని గారపాడులో ఉద్రిక్తతకు కారణమైంది. జడ్పీటీసీ కంకణాల స్వర్ణ కుమారి, ఆమె భర్త శివాజీ గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వద్దకు వెళ్లిన సమయంలో వైసీపీ, టీడీపీ నేతల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. శివాలయం మెరక కోసం మట్టి తోలదామనుకుంటే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు ఇవ్వాల్సిన అవసరం ఏముందని? వైసీపీకి చెందిన మాజీ సర్పంచ్ గణేష్ మాధవరావు, శివాజీలను టీడీపీ సీనియర్ నాయకుడు పెనుముచ్చు రామారావు ప్రశ్నించారు. దీంతో వారి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఆ తర్వాత ఇంటికి వెళ్లిన రామారావు జరిగిన విషయాన్ని తన వర్గీయులకు చెప్పారు. దీంతో టీడీపీకి చెందిన వారు శివాజీ, మాధవరావుల వద్దకు వెళ్లి గతంలో ఆంజనేయస్వామి గుడికి తాము ఇచ్చిన చందాల లెక్కలు చెప్పాలని డిమాండ్ చేయడంతో వారి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ క్రమంలో వైసీపీ వర్గీయులు ఆంజనేయస్వామి గుడిలోకి వెళ్లి తలుపులు వేసుకోగా బయటకు రావాలంటూ టీడీపీ వారు కేకలు వేశారు. ఆలయంలో ఉన్న వైసీపీ వారు 100 నెంబరుకు ఫోన్ చేయడంతో సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు, సీఐ సురేష్ సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. టీడీపీ, వైసీపీ వర్గీయులతో డీఎస్పీ మాట్లాడి సర్ది చెప్పారు. జడ్పీటీసీని ఇంటికి పంపించి వైసీపీ నాయకులను పెదకూరపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. గ్రామంలో గొడవలు జరగకుండా పికెట్‌ను ఏర్పాటు చేశారు.



గారపాడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ హనుమంతరావు

ఐదు బృందాలతో మండలి ఎన్నికల పరిశీలన

శిక్షణా తరగతుల్లో కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పరిశీలనకు జిల్లాలో ఐదు బృందాలను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఎన్నికల నియమావళి అమలుపై కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జరిగిన శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఎంసీసీ, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలేన్స్ విభాగానికి 36 బృందాలను, వీడియో సర్వైలేన్స్ 7, సెక్టార్ ఆఫీసర్స్, రూట్ అధికారులకు సంబంధించి 17 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. 27న జరగనున్న ఎన్నికలకు జిల్లాలో 56,964 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి ఉండగా, వీరిలో 37,831 మంది పురుషులు, 19,129 మంది మహిళలు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని తెలిపారు. 38 ప్రదేశాలలో మొత్తం 90 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు.

22 కల్లా అర్జీలను పరిష్కరించాలి

జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను 22వ తేదీకల్లా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల, డివిజన్ స్థాయిలో ప్రతి సోమవారం వచ్చే అర్జీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి వంద శాతం పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ సూరజ్, డీఆర్వో మురళి, ఆర్డీవోలు మధులత, రమాకాంత్‌రెడ్డి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు డిప్యూటీ డీఈవోల నియామకం



డీఈవో సీవీ రేణుకకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏసురత్నం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ముగ్గురు డిప్యూటీ డీఈవోల్ని నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు డిప్యూటీ డీఈవోగా జి.ఏసురత్నం, బాపట్ల డిప్యూటీ డీఈవోగా కె.సురేష్, నర్సరావుపేట డిప్యూటీ డీఈవోగా ఎస్‌కే మహబూబ్ సుభాని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో సీనియర్ ఎంఈవోగా ఉన్న జి.ఏసురత్నంను గుంటూరు డిప్యూటీ డీఈవోగా నియమించారు. ఈ సందర్భంగా డీఈవో సీవీ రేణుక, ఆర్‌జేడీ లింగేశ్వర రెడ్డిని ఏసురత్నం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డీఐ ఎస్‌కే ఎండీ ఖాసిం, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ.తిరుమలేష్ తదితరులు ఉన్నారు.

వ్యర్థాల నుంచి విముక్తి

(5వ పేజీ తరువాయి)

తగు సవరణల ద్వారా ప్రభుత్వాస్పత్రులు వ్యర్థాల్ని వదిలించుకునే వెసులుబాటు కల్పించారు. ప్రభుత్వ సర్వ జనాసుపత్రులు జిల్లా, ప్రాంతీయ ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వాటి స్థాయిలోనే పేరుకుపోయిన వ్యర్థాల్ని వదిలించుకోవచ్చు. ఈ మేరకు వివిధ ఆస్పత్రుల స్థాయిలో వ్యర్థాల నిర్ధారణ, వాటి వేలం నిర్వహణకు కమిటీల ఏర్పాటుపై నియమాల్ని రూపొందించారు. ఇప్పటివరకు పేరుకుపోయిన వ్యర్థాల్ని కొత్త నిబంధనల ప్రకారం 45 రోజుల్లో వదిలించుకోవాలి. అనంతరం ఈ ప్రక్రియను ప్రతి ఏడాది చేపట్టాలి. తద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఖాతాలో జమచేయాలి. ఆస్పత్రుల వారీగా పేరుకుపోయిన వ్యర్థాల విలువను అంచనా వేయాలని బయో మెడికల్ ఇంజనీర్లను ప్రభుత్వం ఆదేశించింది. డిస్పోజల్ ద్వారా రూ.25 వేలు మించి ఆదాయం వచ్చే అవకాశం ఉంటే 'కొనుగోలు' ఈ ఆక్షన్ పోర్టల్ ద్వారా వేలం వేయాలి. లేకుంటే కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన మెటల్ స్క్రాప్ ట్రేడింగ్ కార్పొరేషన్ ద్వారా విక్రయించాలి.

డేటా ఆధారిత పరిపాలన కీలకం

● ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా



ప్రసంగిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, వేదికపైన వీసీ, వర్సిటీ అధికారులు

పెదకాకాని, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పరిపాలన, వ్యాపార వ్యూహాల్లో డేటా కీలకమైన స్థానం కలిగి ఉందనీ, విశ్లేషణలు, కృత్రిమ మేధస్సును సద్వినియోగం చేసుకునే సామర్థ్యం గల సంస్థలే భవిష్యత్తులో విజయాన్ని సాధిస్తాయని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, సర్వే సెటిల్‌మెంట్, భూపరిపాలన) ఆర్.పి.సిసోడియా అన్నారు. శుక్రవారం వర్సిటీలో 'బిజినెస్ అనలిటిక్స్, ఇంటెలిజెన్స్‌లో పురోగమనలు' అనే అంశంపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్ మెంట్ విభాగంలో నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిసోడియా ప్రసంగిస్తూ డేటా ఆధారిత నిర్ణయాల ప్రాముఖ్యతను వివరించారు. ఆదాయ నిర్వహణ నుంచి ప్రజా సేవల దాకా అనేక రంగాల్లో కృత్రిమ మేధస్సు, పెద్ద డేటా విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నాయని అన్నారు. డేటా విశ్లేషణను సమర్థంగా వినియోగించుకునే సంస్థలు ఆర్థిక అభివృద్ధిలో ముందంజలో ఉంటాయన్నారు. ఎవరు డేటాను సమర్థంగా విశ్లేషించి, అర్థం చేసుకుంటారో వారే భవిష్యత్తులో విజయం సాధిస్తారని స్పష్టం చేశారు. డేటా ఆధారిత భారతదేశాన్ని నిర్మించేందుకు మనమందరం కృషి చేయాలని ఆకాంక్షించారు. విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య ఒప్పందాలు, పరిశోధనలో భాగస్వామ్యం పెరగడం అభినందనీయమని అన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం బిజినెస్ అనలిటిక్స్ పరిశోధన, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. సదస్సు డైరెక్టర్, వాణిజ్య, వ్యాపార పరిపాలన విభాగాధిపతి ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ వ్యాపార వ్యూహాలలో డేటా విశ్లేషణ ప్రాధాన్యతను వివరించారు. ఐఐఎం విశాఖపట్నంకు చెందిన ఆచార్య విజయ భాస్కర్ మాట్లాడుతూ బిజినెస్ ఇంటెలిజెన్స్‌లో ఏఐ, మెషిన్ లెర్నింగ్ పెరుగుతున్న ప్రభావాన్ని వివరిస్తూ, నైతిక డేటా నిర్వహణ కీలకమని అన్నారు. ఐఐఎం రాయ్‌పూర్‌కు చెందిన వర్ష మామిడి, మేధో సంపత్తి హక్కులు, డేటా విశ్లేషణ అనుసంధానంపై మాట్లాడారు. ఐపీఈ హైదరాబాదు డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాస మూర్తి భవిష్యత్తు అంచనాల ప్రాముఖ్యతను వివరిస్తూ, వివిధ పరిశ్రమల్లో దీని వాస్తవ ఉపయోగాలను తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కనకదుర్గ, డాక్టర్ రత్న కిషోర్ పాల్గొన్నారు.

వారసత్వ అమరావతిని నాశనం చేశారు

● ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ



ధరణికోటలోని నూనెగుండం చెరువును పరిశీలిస్తున్న ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) అభివృద్ధి చేస్తారని వైసీపీకి ప్రజలు అధికారం ఇస్తే అన్ని వ్యవస్థలు నాశనం చేయడమే కాకుండా రాజధాని అమరావతితోపాటు వారసత్వ అమరావతిని కూడా సర్వనాశనం చేశారని రాష్ట్ర పర్యాటక డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి వైసీపీ పాలనలో పర్యాటక రంగానికి పూర్తిగా విఘాతం కలిగిందనీ, కోట్లాది రూపాయలతో ఏర్పాటు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు నిర్వీర్యం అయ్యాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. పర్యాటక రంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారని తెలిపారు. దీంతో చైర్మన్ బాలాజీ శుక్రవారం మధ్యాహ్నం వారసత్వ అమరావతిని సందర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల నిధులతో నిర్మించిన అభివృద్ధి పనులను పరిశీలించారు. వారసత్వ కేంద్రంలో గత ప్రభుత్వం మద్యం దుకాణం నిర్వహించారని తెలుసుకుని మండిపడ్డారు. అనంతరం ధ్యానబుద్ధ ప్రాజెక్టు, బుద్ధవనం పరిశీలించారు. తదుపరి ధరణికోట గ్రామంలో రూ.7 కోట్లతో అభివృద్ధి చేసిన నూనెగుండం చెరువు నిరుపయోగంగా ఉండటాన్ని గమనించారు. చారిత్రక ప్రాధాన్యత ఉన్న అమరావతిని గత ప్రభుత్వ పర్యాటకరంగం పూర్తిగా విస్మరించిందన్నారు. డీవీఎం కృష్ణచైతన్య, అసిస్టెంట్ మేనేజర్ కొల్లి శ్రీధర్, కొండయ్య, విజయవాడ మేనేజర్ శ్రీనివాస్, అమరావతి మేనేజర్ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం ఎడ్లకు ప్రథమ స్థానం



ఆరుపళ్ల విభాగంలో బండ లాగుతున్న ఎడ్లు

మాచవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యల కల్యాణాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలు జరుగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన ఆరు పళ్ల విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లు నాలుగు వేల అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా పెదకూరపాడు గ్రామానికి చెందిన ఏటుకూరి శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలెం గ్రామానికి చెందిన రామినేని రత్తయ్య చౌదరి కంబైన్డ్ జత 3773.7 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానంలో నిలిచాయి. తెలంగాణ రాష్ట్రం కోదాడ మండలం నలమాద ఉత్తమ పద్మావతిరెడ్డి ఎడ్లు 3420.1 అడుగుల దూరాన్ని లాగి మూడో స్థానంలో నిలిచాయి. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామానికి చెందిన అనంతనేని శ్రీకావ్య, శ్రీమధు ఎడ్లు 3396.1 అడుగుల దూరాన్ని లాగి నాలుగో స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామానికి చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్లు 3023.5 అడుగుల దూరాన్ని లాగి ఐదో స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా మాచవరం గ్రామానికి చెందిన మన్నెంపల్లి యశశ్విని, పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన వసంత వరపు శ్రీలాస్య, శ్రీమనోజ్ కంబైన్డ్ జత 2339.5 అడుగుల దూరాన్ని లాగి ఆరో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన యామని రామారావు ఎడ్లు రెండు వేల అడుగుల దూరాన్ని లాగి ఏడో స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా గురజాల మండలం గోగులపాడు గ్రామానికి చెందిన ముత్తన వెంకటరెడ్డి ఎడ్లు 528.3 అడుగుల దూరాన్ని లాగి 8వ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్లకు నగదు బహుమతితో పాటు షీల్డ్ బహూకరించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా దుర్గి గ్రామానికి చెందిన దుగ్గి శ్రీనివాసరావు వ్యవహరించారు. ఎడ్ల పోటీలకు కావాల్సిన వసతులను కమిటీ వారు ఏర్పాటు చేశారు.

వర్సిటీలో లా విద్యార్థుల ఆందోళన



లా విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం

పెదకాకాని, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కులవివక్షతతో న్యాయశాస్త్రం విభాగాధిపతి తమను మొదటి ఇంటర్నల్ పరీక్షలను రాయనివ్వలేదంటూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎల్.ఎల్.ఎం. ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఆందోళనకు దిగారు. విశ్వవిద్యాలయంలో ఎల్.ఎల్.ఎం. ప్రథమ సంవత్సరం ప్రథమ సెమిస్టర్ చదువుతున్న 30 మంది విద్యార్థులకు విశ్వవిద్యాలయం నిబంధనల ప్రకారం తగినంత హాజరు లేదంటూ న్యాయశాస్త్రం విభాగాధిపతి ప్రథమ సెమిస్టర్ ప్రథమ ఇంటర్నల్ పరీక్షలకు అనుమతివ్వలేదు. అలాగే న్యాయశాస్త్రం విభాగాధిపతి ఎల్.ఎల్.ఎం. విద్యార్థులకు బోధన చేస్తున్న ఓ అతిథి అధ్యాపకురాలును విద్యార్థుల హాజరు ఇవ్వాలంటూ ఆదేశించారు. దీంతో న్యాయశాస్త్రం విభాగంలో పనిచేస్తున్న కొందరు అతిథి అధ్యాపకులు ప్రథమ ఇంటర్నల్ పరీక్షలకు అనుమతి లభించని విద్యార్థులను కలుపుకొని విభాగాధిపతికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. విభాగాధిపతి కులవివక్షతతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను హాజరు పేరుతో అణగదొక్కుతున్నారంటూ ఆరోపించారు. విభాగాధిపతి తన కులానికి చెందిన ఓ విద్యార్థి కళాశాలకు రాకపోయినా పరీక్షలకు అనుమతించారని ఆరోపించారు. సమాచారం అందుకున్న తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం తగిన న్యాయం చేస్తామంటూ విద్యార్థులకు హామీ ఇచ్చారు.

రెండు ట్రాలీ ఆటోలు ఢీకొని యువకుడి మృతి



ప్రమాదంలో నుజ్జయిన ట్రాలీ ఆటో

శావల్యాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు ట్రాలీ ఆటోలు బలంగా ఢీకొట్టుకోవడంతో యువకుడు మృతి చెందగా, ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో శావల్యాపురం సొసైటీ కార్యాలయం ఎదురుగా గురువారం అర్ధరాత్రి జరిగింది. స్థానిక ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు ప్రకాశంజిల్లా మార్కాపురం నియోజకవర్గం పెదఅరవీడు గ్రామానికి చెందిన ఆమనిగంట వెంకటరమణ(19), సంకుల ఆంజనేయులు, సంకుల గోపి, కోటపాటి గోపీలు టెంటుసామగ్రి, మైకులు బాగు చేయించుకొనేందుకు గుంటూరుకు వెళ్లి గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో శావల్యాపురంలో సొసైటీ కార్యాలయం వద్దకు రాగానే దోర్నాల నుంచి పిడుగురాళ్లకు వెళ్తున్న ట్రాలీ ఆటో ఎదురుగా వస్తుండగా నిద్రమత్తులో దాన్ని బలంగా ఢీకొట్టారు. దాంతో ఆమని వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందగా సంకుల ఆంజనేయులు, గోపి, కోటపాటి గోపీలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని వినుకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ లోకేశ్వరరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తీయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందాడు. నల్లపాడు సీఐ వంశీధర్ కథనం మేరకు... చిలకలూరిపేటకు చెందిన బొన్నం వెంకయ్య (75)ను పెద్ద కుమారుడు పూర్ణచంద్రరావు కాటూరి ఆసుపత్రిలో పరీక్షించేందుకు శుక్రవారం తీసుకొస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల సమీపానికి రాగానే ఓ లారీ వేగంగా మీదుగారాగా పక్కకు తప్పించాడు. దీంతో అదుపుతప్పిన ద్విచక్ర వాహనం పక్కనే ఉన్న రైలింగ్‌ను ఢీ కొట్టింది. తండ్రి వెంకయ్య ఘటనా స్థలంలోనే మృతి చెందారు. గాయపడిన పూర్ణచంద్రరావును ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగుతేజం హారిక గోవాడకు అంతర్జాతీయ అవార్డు



పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉమెన్ టూ వాచ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డుతో అమెరికాలో తెలుగుతేజం మెరిసింది. గుంటూరు జిల్లా పొన్నూరులోని నిడుబ్రోలుకు చెందిన హారిక గోవాడ అంతర్జాతీయ అవార్డు పొందడమే కాకుండా అంతర్జాతీయ మ్యాగ్జైన్ ఫ్యాషన్ విస్టా ముఖచిత్రంపై స్థానం సంపాదించింది. ఆమెపై ప్రత్యేక వ్యాసాన్ని మ్యాగ్జైన్ ప్రచురించింది. నిడుబ్రోలుకు చెందిన గోవాడచౌదరి కుమారుడు గోవాడ హరిబాబు లక్ష్మీప్రసన్నల కుమార్తె హారిక గీతం యూనివర్సిటీలో బీటెక్ అభ్యసించింది. అనంతరం క్యాటర్ పిల్లర్ కంపెనీ ఫెలోషిప్ ద్వారా అమెరికాలోని బ్రాడ్‌లీ యూనివర్సిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ ఎమ్మెస్‌ను అభ్యసించారు. అనంతరం హారిక పోర్టుఫోలియో రికవరీ అసోసియేట్ కంపెనీలో చేరి అంచెలంచెలుగా ఎదిగి అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ స్థాయికి ఎదిగారు. టెక్నాలజీ రంగంలో గ్రిడ్, డిటర్మేషన్‌తో సాంకేతిక రంగంలో సేవలు అందిస్తున్నారు. హారిక సేవలను గుర్తించి ఉమెన్ టూ వాచ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందజేసింది. హారిక అంతర్జాతీయ అవార్డు పొందడంపై పొన్నూరు, నిడుబ్రోలువాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అశ్రునయనాలతో సురేష్ అంత్యక్రియలు



రొంపిచర్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల గ్రామానికి చెందిన చెరుకూరి సురేష్(25) గత నెల 31వ తేదీన ఐర్లాండ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో అతని మృతదేహాన్ని స్వగ్రామమైన రొంపిచర్లకు శుక్రవారం తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అతన్ని చూసేందుకు గ్రామస్తులు, బంధువులు అధిక సంఖ్యలో పడమటిపాలెంలో ఉన్న అతని గృహం వద్దకు వచ్చారు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులు రామకోటయ్య, కుమారి రోదిస్తున్న తీరు స్థానికులకు కంట తడి పెట్టించింది. ప్రభుత్వం తరుపున పలువురు బేగంపేట విమానాశ్రయం నుంచి గ్రామానికి తీసుకు వచ్చారు. 14 రోజుల తరువాత ఐర్లాండ్ నుంచి మృతదేహాన్ని తీసుకు వచ్చారు. అశ్రునయనాలతో అంత్యక్రియలు జరిగాయి.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రత్తిపాడు (వంగిపురం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని వంగిపురం గ్రామంలో జరిగింది. ప్రత్తిపాడు పోలీసుల కథనం ప్రకారం వంగిపురం గ్రామానికి చెందిన వరగాని బాబురావు (59) తనకున్న 40 సెంట్ల భూమితోపాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశారు. గత మూడేళ్లగా పంటలు పూర్తిగా దెబ్బతిని పూర్తి నష్టాలు వచ్చాయి. ఈ ఏడాది కూడా మిర్చి, పత్తి పంటలను సాగు చేశారు. పంటలు దెబ్బతినడంతో అప్పులు తీర్చుకోలేననే బాధతో గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు దుకాణాల్లో చోరీ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెక్‌పోస్టు సెంటర్‌లోని అమరావతి హోండా షోరూమ్, వెంకటేశ్వర రైతు సేవా కేంద్రంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దొంగలు రూ. 3.10 లక్షల నగదును అపహరించుకు వెళ్లారు. శుక్రవారం ఉదయం సమాచారం తెలుసుకున్న వాటి నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. దొంగలు షోరూం, రైతు సేవా కేంద్రం తాళాలు పగలగొట్టి లోపలకు వెళ్లి రెండు దుకాణాల్లో సీసీ కెమెరాల వైర్లను ధ్వంసం చేసి సీసీ కెమెరాల డీవీఆర్‌లను అపహరించుకు వెళ్లారు. రైతు సేవా కేంద్రంలో ఉన్న రెండు లక్షల నగదు, హోండా షోరూంలో ఉన్న రూ.83వేల నగదును అపహరించారు. సీసీ టీవీ డీవీఆర్‌ల విలువ రూ.27 వేలు వరకు ఉంటుంది. ఆయా షాపుల నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ బ్రహ్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో నిందితుడు అరెస్టు

దుర్గి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఆయన మాట్లాడుతూ మండలంలోని తేరాలకు చెందిన బొంతా వీరయ్యపై 2000 సంవత్సరంలో శీలం సిద్ధయ్య, వెంకటేశ్వర్లు దాడి చేసి గాయపరిచారన్నారు. ఆ సమయంలో సిద్ధయ్య, వెంకటేశ్వర్లుపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. కేసు విచారణలో ఉండగా సిద్ధయ్య కోర్టుకు హాజరుకాకుండా పరారయ్యాడన్నారు. కాగా వెంకటేశ్వర్లును మాచర్ల పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరుచగా న్యాయమూర్తి మూడేళ్ల జైలు శిక్ష విధించారన్నారు. పరారీలో ఉన్న సిద్ధయ్యను శుక్రవారం అరెస్టు చేసి మాచర్ల పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్ నిందితునికి మూడేళ్ల జైలు శిక్ష విధించారని ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ప్రకాశం బ్యారేజి వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం కృష్ణానదిలో గుర్తించారు. సీఐ కల్యాణ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం బ్యారేజి 4వ కానా వద్ద మృతదేహాన్ని గమనించిన స్థానికులు సమాచారం ఇచ్చారు. మత్స్యకారుల సాయంతో సదరు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని, ఒంటిపై బచ్చలిపండు రంగు టీ షర్టు, కాకి రంగు షార్ట్ ఉన్నాయని, తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిస్తే తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నీటిమట్టం శుక్రవారం నాటికి 540.80 అడుగులు ఉంది. ఇది 188.32 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9633 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8454 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 7974 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 28,541 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 14,027 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121.129.140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

1,00,564 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 91,613 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,00,564 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 48,224 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	9000	13600	334	11000	11000
నెంబరు. 5	10000	12500	నెంబరు.5	--	--
273	10000	12200	273	--	--
341	10000	14000	341	--	--
4884	10000	12500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13900	తేజ	--	--
బ్యాడిగి	10000	13000	బ్యాడిగి	11000	11000
దేవనూరు డీలక్స్	10000	13200	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	4500	7500	తెల్లకాయలు	4500	6500

కోళ్లఫారాలపై రోజువారి పర్యవేక్షణ ఉండాలి

● జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు

రాజుపాలెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఫారాల్లో ఉన్న కోళ్ళను రోజువారీ పర్యవేక్షించాలని జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి డాక్టర్ కే కాంతారావు ఫారాల యాజమానుల కు సూచించారు. ప్రస్తుతం గోదావరి, కృష్ణాజిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాధి కొన్ని కోళ్ళ ఫారాల్లో ఉన్నందున శుక్రవారం మండలంలోని రాజుపాలెంలో ఉన్న కోళ్ళఫారాలను స్థానిక ఏడీఏ వీరయ్యతో కలిసి సందర్శించారు. మండలంలో మొత్తం రెండు లక్షల కోళ్ళు ఉన్నట్లు వారు గుర్తించారు. ఆయన వెంట మొక్కపాడు గ్రామ పశు వైద్యులు నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

విద్యుత్‌శాఖ అధికారుల తనిఖీలు

● రూ.3.79 లక్షల అపరాధ రుసుం

దుర్గి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగం అధికారులు శుక్రవారం మండలపరిధిలో దాడులు నిర్వహించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించారు. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 23 మందికి రూ.24 వేలు, మీటరు ఉన్నప్పటికీ చౌర్యానికి పాల్పడుతున్న 8మందికి రూ.1.50 లక్షలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరి వినియోగిస్తున్న ఇద్దరికి రూ.12 వేలు, అనుమతించిన లోడు కంటే అధిక లోడు వాడుతున్న 48 మందికి రూ.1.93 లక్షలు, మొత్తంగా రూ.3.79 లక్షల అపరాధ రుసుం విధించారు. ఈ దాడుల్లో విద్యుత్‌శాఖ జిల్లా పర్యవేక్షణ ఇంజనీరు విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింగయ్య, డీఈఈ రవికుమార్, రామయ్య, ఏఈ కోటేశ్వరరావు, చంద్రశేఖర్, శ్రీశైలం పాల్గొన్నారు.

అమరేశ్వరుని దర్శించుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నూతనంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న ఏలూరు శశికుమార్ శుక్రవారం అమరేశ్వరాలయం సందర్శించారు. అనంతరం ఏవీఆర్ కన్వెన్షన్‌లో జరిగిన బీజేపీ ప్రత్యేక కార్యక్రమంలో శశికుమార్‌ను పలువురు బీజేపీ నాయకులు అభినందనలు తెలియజేసి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు, ఎంపీపీ ఎం హనుమంతరావు, మండల అధ్యక్షుడు వీ పుల్లయ్య, స్థానిక బీజేపీ నాయకులు మద్ది ధాత్రినారాయణ, కే వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బెల్లంకొండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను ఆపి అపరాధ రుసుం వసూలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడప వద్దని ఎస్ఐ పేర్కొన్నారు. బెల్లంకొండ క్రాస్ రోడ్డు, మాచాయపాలెం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేశారు.

220 కేవీ సబ్ స్టేషన్లో చోరీ

రెంటచింతల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పశర్లపాడు గ్రామ సమీపంలో ఉన్న 220 కేవీ సబ్‌స్టేషన్‌లో చోరీ జరిగింది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వివిధ సిమెంట్ కర్మాగారాలకు విద్యుత్‌ను సరఫరా, చేసే సబ్‌స్టేషన్‌లో అమర్చిన 18ఎర్త్ స్విచ్ కాపర్ రాడ్లను అపహరించుకుపోయినట్లు డీఈఈ యుగంధర్ శుక్రవారం ఫిర్యాదు చేశారన్నారు. వీటి విలువ రూ.4 లక్షల వరకు ఉంటుందన్నారు. టెక్నికల్ వ్యవస్థలో నిష్ణాతుడే ఈ దొంగతనానికి పాల్పడినట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఈ దొంగతనం 13వ తేదీ తెల్లవారుజామున జరిగినట్లు అనుమానిస్తున్నారు.

మృతదేహం గుర్తింపు : ఎస్ఐ

ముప్పాళ్ళ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటూరు బ్రాంచ్ కెనాల్ నార్నెపాడు బ్రిడ్జి వద్ద గుర్తించిన మృతదేహానికి సంబంధించిన వివరాలు తెలిశాయని ఎస్ఐ సోమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. పిడుగురాళ్ళ మండలం జానపాడు గ్రామానికి చెందిన ఇంజమూరి ముసలయ్య (29), పవన్‌గా పిలువబడే వ్యక్తిదిగా కుటుంబ సభ్యులు గుర్తించారని ఎస్ఐ తెలిపారు. మృతుడు ఇంజమూరి ముసలయ్య భార్య కోమలి తన పుట్టిల్లు అయిన నకరికల్లు మండలం కండ్లకుంటకు ఫంక్షన్ ఉండటంతో వెళ్లగా నాలుగు రోజులక్రితం ముసలయ్య వచ్చాడు కొంత సేపటి తరువాత బజారుకని వెళ్ళి తిరిగి రాలేదు. ముసలయ్య మానసికంగా ఇబ్బందులు పడుతుంటాడని గతంలో పలు మార్లు ఆత్మహత్యాయత్నం చేసినట్లు కోమలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సేవాలాల్ జయంతిని అధికారికంగా ప్రకటించాలి

● గిరిజన సంఘ నేతలు

మాచర్లటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని గిరిజన సంఘ నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రంగారావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమైఖ్య ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు నూన్సావత్ రంగానాయక్, శ్రీనునాయక్, మూఢావత్ బాలోజీనాయక్, సర్దార్‌నాయక్, శంకర్‌నాయక్, మంత్రునాయక్ కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 31.50 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలి పారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

ఆకాశాన్ని అంటుతున్న వరిగడ్డి ధరలు

● మేత కొరతతో భారంగా పశుపోషణ
● ట్రక్కు గడ్డి ధర రూ.15వేలు
● మిషన్లతో వరికోయడమే కారణం

క్రోసూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో వరిగడ్డి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కూలీల కొరతతో ఎక్కువ భాగం వరి పంటను మిషన్లతో కోయించటంతో గడ్డి గేదెలు మేయడానికి పనికి రాకపోవటంతో గడ్డి ధరలు పెరిగినట్లు భావిస్తున్నారు. గత సంవత్సరం ట్రక్కు పది నుంచి రూ.11వేలు ఉన్న గడ్డి ధర ఈ సంవత్సరం రూ.14వేలు నుంచి రూ.15వేలు వరకు పలుకుతుంది. మోపు గడ్డి ధర రూ.150 వరకు పలుకుతుందని రైతులు చెపుతున్నారు. సబ్ డివిజన్‌లో సుమారు 14వేల ఎకరాల్లో వరి పండించినప్పటికీ ఎక్కువ భాగం పంటను మిషన్లతోనే కోయించారు. కూలీలతో కోయించిన గడ్డి మాత్రమే రైతులు గేదెలకు మేతగా ఉపయోగిస్తున్నారు. మరోవైపు పశు దాణా ధరలు కూడా ఎక్కువగా ఉన్నాయి. దాణా కట్ట రూ.1200 వరకు ఉంది. రోజుకు ఒక్కొక్క గేదెకు రెండు నుంచి మూడు కిలోల వరకు దాణా వేయాల్సి ఉంది. ఈ లెక్కన రోజుకు ఒక్కొక్క గేదెకు మూడు వందల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మరో వైపు పశువుల కోసం మినీ గోకులాలు నిర్మిస్తున్న ప్రభుత్వం పశుపోషణకు ఉపయోగించే మేత విషయంలో చర్యలు తీసుకోవటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఐదు మండలాల్లో సుమారు రూ.5వేల వరకు ఆవులు, గేదెలు ఉన్నాయి వర్షాకాలంలో పచ్చి మేత దొరికినప్పటికీ వేసవిలో మాత్రం పాడి రైతులు మేత సమస్యను ఎదుర్కొంటున్నారు. పశుగ్రాసం కోసం జొన్న, మొక్కజొన్న, సొప్పను పొలాల్లో కొంత భాగం పెంచి మేత కోసం నిల్వ చేసుకోవాలని అధికారులు చెపుతున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పది సెంట్ల నుంచి అర ఎకరం వరకు మేత సాగు చేసుకొనేందుకు రైతులకు సాయం అందిస్తున్నట్టు పశు సంవర్థకశాఖ అధికారులు చెపుతున్నారు. గతంలో మేత కొరత ఏర్పడినప్పుడు క్రోసూరు మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో పశు పోషణ శిబిరాలు నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. ధరలు మండుతున్న తరుణంలో అధికారులు ముందుకు వచ్చి పశుపోషణ కోసం సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.



అమ్మకానికి ట్రాక్టర్‌లో తరలిస్తున్న వరి గడ్డి



బీళ్ళల్లో గడ్డి మేస్తున్న గేదెలు

ఆలపాటిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదును గెలిపించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. కన్నా ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో, కాకతీయ కల్యాణ మండపంలో న్యాయవాదులతో జరిగిన సమావేశంలో కన్నా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ విజయం కోసం ఏ విధంగా కృషి చేశారో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెట్టింపు స్థాయి లో ఆలపాటి విజయం కోసం కృషి చేయాలని పెన్షనర్ల ను, న్యాయవాదులను కన్నా లక్ష్మీనారాయణ కోరారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీల కులు వేములకొండ శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జే లక్ష్మీనారాయణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కట్టా శంకరరావు, న్యాయవాదులు ఎంవీ చలపతిరావు, భాస్కర్‌రెడ్డి, చలువాది చిన సత్యనారాయణ, బత్తుల ఆదినారాయణ, పూజల వెంకటకోటయ్య, జానీ ఖాజా వలి, పూదోట రాజు, గుజ్జర్లపూడి మార్కురావు, అను మోలు జయరామ్, బాపయ్య చౌదరి పాల్గొన్నారు.

● **నకరికల్లు (ఆంధ్రజ్యోతి)**: నకరికల్లు లోని టీడీపీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ అభ్య ర్థులతో, స్థానిక టీడీపీ నేతలతో ఎమ్మెల్యే కన్నా సమావేశమయ్యారు. ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకొనే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని స్థానిక నేతలకు సూచించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు ఐకమత్యంతో పని చేయాలన్నారు. పట్ట భద్రులందరూ అభివృద్ధికి పట్టం కట్టాలని కన్నా కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య, పూజల వెంకట కోటయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● **సత్తెనపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి)** : పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన శుక్రవారం గ్రామంలోని జడ్పీ హైస్కూల్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, సచివాలయాలకు వెళ్లి ఉద్యోగులను కలిశారు. ఆలపాటి గెలుపునకు సహకరించాలన్నారు. పట్టభద్రులకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు నిమ్మగడ్డ పూర్ణయ్య, టీడీపీ నాయకులు కోట కాళిదాసు, నిమ్మగడ్డ మల్లయ్య, సంగం ప్రసాదు, చింతా అశోక్, షేక్ ఆదం షఫీ, మదమంచి గోపీ, నిమ్మగడ్డ సీతారామయ్య, ముక్కపాటి మాబూసుబానీ తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లి పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

● **రాజుపాలెం (ఆంధ్రజ్యోతి)**: ఆలపాటిని అఖండ మెజార్టీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు పిలుపునిచ్చారు. రాజుపాలెంలో జడ్పీ హైస్కూల్లో, నవోదయ ఇంగ్లిష మీడియం పాఠశాలలో పట్టభద్రులను కలిసి ఆలపాటిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు తోట నరసయ్య, టీడీపీ నాయకులు గంగవరపు రామలక్ష్మణరావు, చిన్నబోయిన రాఘవరావుయాదవ్, శనగపూల నరసింహరావు, తోట శ్రీను, తమటం వీరయ్య, పగడాల శ్రీను, చిమట సైదరావు తదితరులు ఉన్నారు.

శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన డీసీ శ్రీనివాసరావు

రెంటచింతల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పల్నాట ప్రముఖ శైవక్షేత్రం కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలో ఈనెల 26న నిర్వహించే మహాశివరాత్రి ఏర్పాట్లను దేవదాయ డిప్యూటీ కమిషనర్ కామినేని బసవ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. నదిలో భక్తులు స్నానం చేయడానికి గల అవకాశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పుష్కర ఘాట్లలో స్నానం చేసే భక్తులు నది లోపలికి వెళ్లకుండా తీగను ఏర్పాటు చేశారు. అలాగే ఇనుప క్యూలైన్లకు మరమ్మతులు చేశారు. విద్యుత్ ప్రభలు నిలబడే స్థలాన్ని పరిశీలించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఈవో గాదే రామిరెడ్డి, నీలం మల్లయ్య, లింగయ్య తదితరులున్నారు.

● **గురజాలటౌన్ (ఆంధ్రజ్యోతి)**: మండలంలోని కృష్ణానది తీరాన దైదబిలంలో ఉన్న శ్రీఅమరలింగేశ్వరస్వామి దేవస్థానం వద్ద శివరాత్రి ఏర్పాటు పనులు శుక్రవారం దేవదాయశాఖ ఉపకమిషనర్ పరిశీలించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. శానిటేషన్, మంచినీటి వసతి, క్యూలైను ఏర్పాటు తదితర వాటిపై సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట ఈవో పూర్ణచంద్రరావు ఉన్నారు.



దైదలో మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవదాయశాఖ ఉప కమిషనర్ శ్రీనివాసరావు

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలకులు ప్రభుత్వ టీచర్లను నాడు నేడు ముసుగులో వేధింపులకు గురి చేశారని, కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దేలా టీచర్లను ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం గుంటూరు వెళ్తున్న ఎమ్మెల్యే జూలకంటి రెంటచింతలలో విలేకరులతో మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్స్, టీచర్లు క్రియాశీలకంగా వ్యవహరించి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా పట్టభద్రుల ఓటర్ల సంఖ్య 7252 ఉండగా రెంటచింతలలో 833 ఓట్లున్నాయన్నారు. ప్రయివేట్ పాఠశాలల టీచర్లతో ప్రత్యేకంగా సమావేశం కావాలని పార్టీ శ్రేణులను కోరారు.

ఆలపాటికి ఓటు వేసి అభివృద్ధికి సహకరించండి

● జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ వరప్రసాదు



ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి ఓట్లు అడుగుతున్న జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ వరప్రసాదు

పెదకూరపాడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆలపాటి రాజేంద్ర ప్రసాదుకు ఓటు వేయండి, అభివృద్ధికి సహకరించండని జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎస్‌వీవీఎస్ వరప్రసాదు అన్నారు. పెదకూరపాడులో శుక్రవారం ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ గ్రామంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బాష్యం ఆంజనేయులు, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, డీసీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, టీడీపీ జిల్లా కార్యదర్శి షేక్ ముంతాజ్, గుడిపూడి బాబూరావు, షేక్ మలాట్ రఫీ, కంచర్ల మార్కు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం దామోదరం సంజీవయ్యకు నివాళి



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞాన్‌రాజ్‌పాల్ మాట్లాడుతూ సంజీవయ్య ముఖ్యమంత్రిగా పని చేసి సంక్షేమానికి ప్రజలకు చేరువ చేశారన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాదంశెట్టి వేదాద్రి, షేక్ చాంద్ బాషా, కొత్త లక్ష్మయ్య, సిద్దెల మోహన్‌రావు, కోటా ఆనంద్, వెంకటేశ్వర్లు, కే సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. వైసీపీ కార్యాలయంలో కూడా నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

రాజుపాలెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెంలో మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు శ్రీవైష్ణవ హరిదాసుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న కమ్యూనిటీ హాల్లో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి సంఘ పెద్దలు పూలమాల వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రిగా ఆయన రికార్డుకెక్కారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వైష్ణవ హరిదాసుల సంఘ నాయకులు, తదితరులు ఉన్నారు.

విధి నిర్వహణలో సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలి

● అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు శ్రీనివాస్ కళ్యాణ్, ప్రశాంత్

మాచర్లటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): న్యాయాన్ని గెలిపించడంలో న్యాయవాదుల పాత్ర కీలకమైందని, విధి నిర్వహణలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు శ్రీనివాస్ కళ్యాణ్, ప్రశాంత్‌లు అన్నారు. బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను శుక్రవారం పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు శ్రీనివాస్ కళ్యాణ్, ప్రశాంత్‌లు ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గంగ్రకోట శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు షేక్ గౌస్‌బాషా, కార్యదర్శి పేరువాల అనిల్ కుమార్‌లతోపాటు కార్యవర్గ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ న్యాయవాదులంతా ఐక్యంగా ఉండాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగ్రకోట శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగూర్‌జానీ, గంగుల శ్రీనివాసరావు, విడేల వీరవెంకట పుల్లారావు, పూజల మాధవి, శీలం వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పోషణతో పాటు విద్య కూడా అందించాలి : ఎంఈవో శ్రీధర్

మాచవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థినీ విద్యార్థులకు పోషణతో పాటు విద్యను కూడా అందించాలని ఎంఈవో శ్రీధర్ అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలందరికీ పోషణ్ భీ పడాయీ భీ పథకాన్ని సమర్థవంతంగా అమలుచేయాలనే ఉద్దేశంతో మూడు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎంఈవో శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరై కేంద్రాల్లో ఉన్న విద్యార్థులకు పోషణతో పాటు విద్యను కూడా అందించాలని సూచించారు. అదేవిధంగా ఆరు సంవత్సరాల లోపు వయస్సు కలిగిన విద్యార్థులందరికీ ముఖ్యంగా అందించాలన్నారు.

జనచైతన్యసమితి కృషి అభినందనీయం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) గ్రామీణ ప్రాంతాల్లో మహిళల స్వయం ఉపాధికి జనచైతన్యసమితి చేస్తున్న కృషి అభినందనీ యం అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం అమరావతిలో నెహ్రూ యువకేంద్రం గుంటూరు, ఉత్తర అమెరికా తెలుగుసంఘం సహకారంతో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 40 మంది మహిళలకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వం పేద మహిళలకు అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో పది మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం నేషనల్ కోఆర్డినేటర్ రామకృష్ణ బాలినేని మాట్లాడుతూ పేద కుటుంబాల ఆర్థికస్వాలంబనకు ఉత్తర అమెరికా తెలుగుసంఘం సంపూర్ణ సహకారం అందిస్తుందని అన్నారు, ఎంపీపీ ఎం హనుమంతరావు, నెహ్రూ యువకేంద్రం జిల్లా కోఆర్డినేటర్ దేవిరెడ్డి కిరణ్మయి, జనచైతన్య సమితి తుళ్లూరి సాంబశివరావు, స్టాలిన్‌బాబు, ట్రైనర్ శివపార్వతి పాల్గొన్నారు.

రైతులు 'ఫార్మర్ రిజిస్ట్రేషన్' చేయించుకోవాలి

● ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు

మాచవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పొలం ఉన్న ప్రతి రైతు గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పిడుగురాళ్ళ ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. శుక్రవారం మాచవరం రైతుసేవాకేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఫార్మర్ రిజిస్ట్రీకి ఆధార్ కార్డు జిరాక్స్, పొలం పాసు బుక్, ఆధార్ కార్డు లింక్ అయిన ఫోన్ నెంబరు తీసుకొని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు.

పట్టలు లేకుండా ఇసుక తరలింపు

● వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు

అచ్చంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఇసుక రీచ్‌ల నుంచి ట్రాక్టర్లపై ఉచితంగా ఇసుక తరలిస్తున్నారు. కాని రేవు నుంచి ఒడ్డుకు వచ్చాక ఇసుకపై పట్టా కప్పాల్సిన బాధ్యత ట్రాక్టర్ డ్రైవర్లు మరచిపోతున్నారు. ఈ క్రమంలోనే ట్రాక్టర్లకు టేప్ రికార్డులు అమర్చి వారి ఇష్టానుసారం సౌండ్ పెట్టుకొని రోడ్లపైకి వస్తున్నారు. ఇసుక ట్రాక్టర్‌కు పట్ట కప్పకపోవటంతో అటుగా వస్తున్న వాహనదారులపై గాలికి ఇసుక పడటం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కళ్లల్లో ఇసుక పడటం వల్ల చిన్న చిన్న ప్రమాదాలు కూడా జరిగాయి. అత్యధిక సౌండ్ వల్ల వెనుక నుంచి వచ్చే వారికి కనీసం దారి ఇవ్వాలని డ్రైవర్లు మరచిపోతున్నారు తక్షణమే సంబంధిత అధికారులు అలాంటి వాహనాలపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.



పట్టలు కప్పకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

రాష్ట్ర అభివృద్ధి కోసం ఆలపాటిని గెలిపించాలి

● ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అభి వృద్ధిలో 20 సంవత్సరాలు వెనక్కిపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో గుంటూరు కృష్ణా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించుకోవడం ద్వారా చంద్రబాబునాయుడు సంకల్పానికి కొండంత బలం చేకూర్చుతుందని ఎమ్మెల్యే ప్రవీణ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ధరణికోట గ్రామంలోని ఆర్‌వీవీఎన్ కళాశాల, కేరళ మోడల్ స్కూల్ నందు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని అభ్యర్థించారు. ఉమ్మడి కూటమి మద్దతుతో బరిలో ఉన్న ఆలపాటిని గెలిపించుకోవడం ద్వారా నిరుద్యోగుల, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమం అవుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాలల బోధనా సిబ్బంది, ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఆర్‌వీవీఎన్ కళాశాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అచ్చంపేట మండలంలో..

అచ్చంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలంలో ఎమ్మెల్సీగా ఆలపాటి రాజాను గెలిపించేందుకు పట్టభద్రులు ఓట్లు వేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అన్నారు. శుక్రవారం మండల నాయకులు కస్తల, కోనూరు, రుద్రవరం, చిగురుపాడు గ్రామాల్లోని పట్టభద్రులను ఉపాధ్యాయులను కలసి ఆలపాటి రాజాకు ఓటు వేయాలంటూ అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదంతో పాటు వెనిగండ్ల కోటయ్య, గంధం కోటేశ్వరరావు, తాళ్ళూరి సుబ్బారావు, బోదెల సాంబిరెడ్డి, తిరువాయిపాటి ఆంజనేయులు, నెల్లూరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

క్రోసూరు మండలంలో..

క్రోసూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగ సమస్య పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు అన్నారు. పలువురు టీడీపీ నాయకులతో కలసి మండలంలోని దొడ్లేరులో ఆలపాటికి ఓటు వేసి గెలిపించాల్సిందిగా శుక్రవారం ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తోకా వెంకటరావు, గుడిపాడు బాషా, మొగల్ జాన్, నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల దన్నుతో టీడీపీ అరాచకాలు

● మాజీ గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ళ మున్సిపాలిటీకి వైస్‌చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో టీడీపీ పోలీసుల దన్నుతో అరాచకాలకు పాల్పడుతుందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నరసరావుపేటలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాసు మాట్లాడుతూ వైసీపీ కౌన్సిలర్లు కిడ్నాప్ చేయడం, బెదిరించడం ద్వారా ఈ నెల 17న జరగబోయే ఉపఎన్నికను అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల పిడుగురాళ్ళ మున్సిపల్ కౌన్సిలర్‌ను టీడీపీ నేతలు కిడ్నాప్ చేసిన నేపథ్యంలో కోర్టులో హెబియస్ కార్పస్ పిటీషన్ దాఖలుచేసి వెంటనే సదరు కౌన్సిలర్ తీసుకు వచ్చామన్నారు. టీడీపీ చేస్తున్న దుర్మార్గాలను ప్రజలు గమనిస్తున్నారని, అధికారం ఏవరికి శాశ్వతం కాదన్నారు.

మేము ఎవరినీ బెదిరించలేదు : సీఐ వెంకట్రావు



పిడుగురాళ్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నికకు సంబంధించి వైసీపీ కౌన్సిలర్లను ఎవరినీ కూడా బెదిరించి భయపెట్టలేదని, ఆ అవసరం పోలీసులకు లేదని పట్టణ సీఐ ఎస్ వెంకట్రావు తెలిపారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 3, 4 తేదీల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి వైసీపీ కౌన్సిలర్లే కొందరు గైర్హాజరు కావడంతో ఎన్నిక వాయిదా పడిందన్నారు. కొందరు సోషల్ మీడియాలో చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్నామని, 29వ వార్డు కౌన్సిలర్ సైదావలి వ్యక్తిగత పనులపై హైదరాబాద్ వెళ్లినట్లు చెబుతున్నాడని, 14వ వార్డు కౌన్సిలర్ పులి వెంకట బాలకాశీ కూడా వ్యాపార పనులపై పొరుగూరు వెళ్లాడే తప్ప ఎటువంటి ఇబ్బందులు లేవని పులి బాలకాశీనే స్వయంగా వీడియో ద్వారా వెల్లడి చేశాడన్నారు. పత్రికల్లో, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ పోలీసుశాఖపై ఆరోపణలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని అన్నారు. 23వ వార్డు కౌన్సిలర్ జూలకంటి శ్రీరంగ రజని భర్త శ్రీనివాసరావు గతంలో దేవా లయ కమిటీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 2 కేజీల వెండి, మరి కొన్ని వస్తువులను శ్రీనివాసరావు వద్దే ఉన్నాయని దేవాలయ పూజారి ఫిర్యాదు మేరకు శ్రీనివాసరావును విచారించేందుకు పిలుస్తుండగా అత ను రాజకీయ రంగు పులుముతుండటం సరికాదని సీఐ తెలిపారు.

ఉపాధిహామీ పథకంపై సమీక్ష

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంపై శుక్రవారం పట్టణంలోని ఉపాధి హామీ కార్యాలయంలో గురజాల ఏపీడీ కొరటా మల్లికార్జునరావు ఆధ్వర్యాన నియోజకవర్గస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఫారంపాండ్స్, ఇంకుడు గుంతలు, ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడం, సరాసరి వేతనం, క్యాటిల్ షెడ్స్, శ్రమశక్తి సంఘాలు, హౌసింగ్ 90 రోజులు పనిదినాలు, ఉద్యాన పంటలు తదితర వాటిపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.


కోటప్పకొండలో నిర్మించిన శివపార్వతులు, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి భారీ విగ్రహం

నిధుల్లేకుండా ఏర్పాట్లు ఎలా?

- ఈవో లేఖ రాసినా స్పందించని ప్రభుత్వం
- కొండ దిగువున ప్రారంభించని పనులు
- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- ఒక్క దేవస్థానం వద్దే ఏర్పాట్లు ప్రారంభం
- పది రోజుల్లో మహాశివరాత్రి ఉత్సవాలు
- కోటప్పకొండ తిరునాళ్లపై చేతులెత్తేస్తున్న అధికారులు

(కోటప్పకొండ/నరసరావుపేట), ఆంధ్రజ్యోతి)

మహాశివరాత్రి పురస్కరించుకొని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో జరిగే తిరునాళ్ల దేశ ప్రసిద్ధి. దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తిరునాళ్లకు తరలివస్తారు. తిరునాళ్లలో విస్తృత ఏర్పాట్లు చేయాల్సి ఉంది. 26న తిరునాళ్ల జరగనుంది. అయితే 24 ఏకాదశి నుంచి తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఇంకా 10 రోజులే సమయం ఉన్నా భక్తులకు వసతులు కల్పించే విషయంలో సంబంధిత శాఖల అధికారులు చూద్దాం.. చేద్దాంలే అన్న రీతీలో వ్యవహరిస్తున్నారు. ఒక్క దేవస్థాన ప్రాంగణంలోనే ఏర్పాట్లు జరుగుతున్నాయి. క్యూలైన్ల పనులు దేవస్థానం అధికారులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. కొండ దిగువున ఏర్పాట్ల పనులు ఇంకా ప్రారంభించలేదు.

వెంటనే ప్రారంభించకపోతే..

తిరునాళ్ల ఏర్పాట్లకు నిధుల సమస్య అధికారులను వెంటాడుతోంది. దీంతో ఏర్పాట్లు పనులు చేపట్టే విషయంలో అధికారులు పనులు చేయిస్తే నిధులు ఎలా అన్నట్టుగా వారి తీరు కనిపిస్తోంది. నిధులు ఎలా సమకూర్చుకున్నా తిరునాళ్లకు ఏర్పాట్లు వెనువెంటనే ప్రారంభించకుంటే భక్తులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. తిరునాళ్ల ఏర్పాట్లలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలే కీలకం. అవసరమైన రహదారులకు మరమ్మతులు, బారికేడ్లు, విద్యుత్ లైట్ల ఏర్పాట్లు ఆర్‌అండ్‌బీ శాఖ చేయాల్సి ఉంది. పంచాయతీ రాజ్ శాఖ కోటప్పకొండకు ఉన్న రహదారులకు మరమ్మతులు, కొండ ప్రాంతంలో పారిశుధ్య పనులు చేపట్టాలి. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ తాగు నీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం చేయాలి. ఆయా పనులు ప్రారంభించి ఏకాదశి 24 కల్లా పూర్తి చేయాలి. కొండలో ఉన్న చెరువులను ఇంకా నీటితో నింపలేదు. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. భక్తులకు నీటి సరఫరా చేసేందుకు శంభులింగ చెరువు, ఎర్ర చెరువులను నింపాల్సి ఉంది. అధికారులు చెరువులను యుద్ధప్రాతిపదికన నింపాలి. లేకుంటే తిరునాళ్లలో భక్తులు నీటి ఇబ్బందులను ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

రోడ్ల అభివృద్ధిపై అలసత్వం

కోటప్పకొండ - కొత్తపాలెం రహదారి పునర్నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాల్సి ఉంది. రహదారిని అలానే వదిలేస్తే భక్తుల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగే పరిస్థితి ఉంది. ట్రాఫిక్ మళ్లింపులో కీలకంగా ఉన్న చిలకలూరిపేట మేజర్ కాలువ రహదారిలో ఏర్పడిన గోతులు పూడ్చేందుకు చర్యలు చేపట్టాలి. ఈ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఘాట్ రోడ్డు మార్జిన్ ప్రమాదకరంగా ఉంది. అటవీ శాఖ నిర్వహణలో ఉన్న ఘాట్ రోడ్డు మార్జిన్‌ను అభివృద్ధి చేసే అంశంపై అలసత్వం నెలకొంది. కొండకు ఉన్న రహదారులలో ఏర్పడిన గోతులను పూడ్చే పనులు చేపట్టకపోతే భక్తుల వాహనాల రాకపోకలకు ఇక్కట్లు తప్పవు.


వేర్వేరుగా క్యూలైన్లు..

కొండపైన దేవస్థానం ప్రాంగణంలో తిరునాళ్ల ఏర్పాట్ల పనులు ప్రారంభమయ్యాయి. క్యూలైన్‌ల నిర్మాణం జరుగుతుంది. వీవీఐపీ, వీఐపీలకు వేర్వేరుగా క్యూలైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. శీఘ్రదర్శనం, ఉచిత దర్శనం, అభిషేకంకు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల విశ్రాంతి కోసం దేవస్థాన ప్రాంగణంలో షామీయానాలు ఏర్పాటు చేస్తున్నారు. అరిసె, లడ్డూ ప్రసాదం తయారి జరుగుతుంది.


శివపార్వతుల భారీ విగ్రహ నిర్మాణం

కోటప్పకొండలో నరసరావుపేట రహదారిలో చిలకలూరిపేట మేజర్ కాలువ సమీపంలో శివపార్వతి.. విఘ్నేశ్వరుడు.. సుబ్రమణ్యం స్వామి భారీ విగ్రహంను నిర్మించారు. 2023లో నిర్మాణం చేపట్టారు. సుమారు రూ. 1.43 కోట్ల వ్యయంతో నిర్మించారు. నిర్మాణ పనులు పూర్తయ్యాయి. భక్తులు దర్శించుకునేలా విగ్రహం వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు.


గోనెపూడి రహదారి దుస్థితి


ఇంకా నీటితో నింపని శంభులింగ చెరువు


క్యూలైన్‌లు పరిశీలిస్తున్న దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి నాగవినయ్‌చంద్


అనందవల్లి దేవాలయం వద్ద ఆర్చికి రంగులు వేస్తున్న దృశ్యం

ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటికి తిరునాళ్ల బాధ్యతలు

తిరుపతిలో తొక్కిసలాట సంఘటన జరిగిన నేపథ్యంలో కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్ల విషయంలో ప్రభుత్వం ఉన్నతాధికారులను అప్రమత్తం చేస్తోంది. తిరునాళ్ల బాధ్యతలను నలుగురు ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం అప్పగించింది. జిల్లా ఇన్‌చార్జ్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబులకు అప్పగించారు. వీరు ఇప్పటికే ఒక మారు కోటప్పకొండలో పర్యటించి భక్తులకు కోసం చేపట్టాల్సి ఏర్పాట్లపై సమీక్షించారు. విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని, పనులు వేగవంతం చేయాలని వారు కోరినప్పటికీ అధికారులు మాత్రం ఇంకా ఏర్పాట్లు ప్రారంభించకపోవడం గమనార్హం.

నిధుల ఊసెత్తని ప్రభుత్వం

తిరునాళ్ల ఏర్పాట్లకు ప్రభుత్వం ఇంకా నిధులు విడుదల చేయలేదు. దేవస్థానం ఈవో నిధుల కోసం లేఖ రాశారు. దీనిపై ఇంకా దేవదాయ శాఖ స్పందించలేదు. దేవస్థానం వద్ద భక్తుల కోసం చేసే ఏర్పాట్లకు రూ.30లక్షల నిధులు విడుదల చేయాలని, గత ఏడేళ్లుగా నిలిచిపోయిన నిధులను కూడా విడుదల చేయాలని లేఖ ద్వారా ఈవో కోరారు. కొండ దిగువున భక్తుల కోసం ఏర్పాట్లకు ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరుకాలేదని అధికారులు చెబుతున్నారు. వందలాది పోలీసులు బందోబస్తులో పాల్గొంటారు. వీరికి భోజనవసతి పోలీసు శాఖ సొంతంగా సమకూర్చుకోవాల్సిన పరిస్థితి. భక్తుల విరాళాలపై పోలీసు శాఖ ఆధారపడాల్సి వస్తుంది. ఇదే పరిస్థితిని ఏర్పాట్ల విషయంతో ఇతర శాఖలు కూడా ఎదుర్కొంటున్నాయి.

భక్తులు సంతోషంగా వెళ్లాలి : దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి

దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి నాగవినయ్‌చంద్ తిరునాళ్ల ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. భక్తులు త్రికోటేశ్వరస్వామిని దర్శించుకుని సంతోషంగా వెళ్లేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి సరఫరా, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. శానిటేషన్ పనులకు సిబ్బందిని మూడు షిఫ్టులు ఏర్పాటుచేయాలని సూచించారు. ఎవరైనా విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రసాదం కొరత లేకుండా చూడాలని, గతేడాది కంటే తయారీ పెంచాలన్నారు. దేవస్థానంలో ఏర్పాటుచేస్తున్న క్యూలైన్‌లు, అభిషేక మండపాన్ని ఆయన పరిశీలించారు. వినయ్‌చంద్ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు, ఆర్డీవో మధులత, ఈవో టి.సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగేదాక స్పందించరా!



చిన్న తప్పిదం వలన పెద్ద ప్రమాదాలు జరుగుతాయి. నిత్యం వేలాది మందితో రద్దీగా ఉండే గుంటూరు మిర్చి యార్డులో మ్యాన్ హోల్స్ అన్నీ తెరిచే ఉన్నా, అక్కడి అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. దాని మీద నుంచే ఎంతోమంది అటూ ఇటూ తిరుగుతూ ఉన్నారు. పొరపాటున కాలు అందులో వేస్తే అంతే సంగతులు. కనీసం ఇప్పుడైనా అధికారులు స్పందిస్తే జరగబోయే పెను ప్రమాదం తప్పుతుంది.

(ఆంధ్రజ్యోతి, గుంటూరు)

బాల్యం.. వ్యర్థం



తిరుగుతూ వ్యర్థాలు పోగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. బడిబాట పట్టాల్సిన ఈ చిన్నారుల జీవితం వ్యర్థాలతో రోడ్ల మధ్యనే గడిచిపోతోంది. స్థానిక నరసరావుపేట రోడ్డులోని మిర్చియార్డు సమీపంలో పనికిరాని బాటిల్స్, ఇనుప వ్యర్థాలు ఏరుకుంటూ బాలలు ఇలా రోడ్లపై తిరుగుతున్నారు. బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన కోసం ప్రభుత్వం ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా అవి వారి దరికి చేరడం లేదు. బడిలో ఉండాల్సిన బాలలు బజారులో బాల కార్మికుల సంరక్షణ కోసం పనిచేస్తున్న యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు ఏమయ్యాయో సంబంధిత అధికారులకే తెలియాలి.

- (గుంటూరు, ఆంధ్రజ్యోతి)


ఇటీవల సీసీ కెమెరాలో కనిపించిన పులులు

విజయపురిసౌత్ రేంజ్ పరిధిలో 5 పులుల గుర్తింపు

- వైల్డ్‌లైఫ్ రేంజర్ సుజాత

వెల్దుర్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విజయపురిసౌత్ వైల్డ్‌లైఫ్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో 5 పులులను గుర్తించినట్లు వైల్డ్‌లైఫ్ ఫారెస్ట్ రేంజర్ సుజాత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పులుల లెక్కింపు పూర్తయిందనీ, రేంజ్ పరిధిలో ఒక ఆడ, ఒక మగ పులులతోపాటు మూడు పులి పిల్లలు ఉన్నట్లు చెప్పారు. అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వీటి జాడను గుర్తించినట్లు తెలిపారు. ఫారెస్ట్‌లో ఏర్పాటు చేసిన గేట్లను దాటి ఎవరూ లోపలకు వెళ్లకూడదని సూచించారు. వేసవి దృష్ట్యా అడవిలో నీటి ఎద్దడి ఉంటుందనీ, పులులు గ్రామ సమీపాల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అటవీ ప్రాంత సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా ఇప్పటికే అడవిలో సాసర్‌పిట్లు (నీటి కుంటలు) ఏర్పాటు చేసి ట్యాంకుల ద్వారా నీటిని నింపుతున్నామన్నారు.

సీఆర్డీఏకు సవాలు


సీఆర్డీఏ కార్యాలయం ముందు గుంతలు పూడ్చేందుకు తోలిన మట్టి

(5వ పేజీ తరువాయి)

సారించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు 2019కి ముందు నిర్మించిన భవనాల పరిస్థితిని తెలుసుకోవడానికి రాజధానిలో పర్యటించారు. కిందటేడాది అక్టోబరు 20న జరిగిన ఆ పర్యటనలోనే ఆయన సీఆర్డీఏ భవన నిర్మాణాల పనులను పునః ప్రారంభించారు. మరో రెండు నెలల్లో సీఆర్డీఏ కార్యాలయం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ మాట చెప్పి ఇప్పటికి నాలుగు నెలలు కావస్తున్నది. అయితే ఇప్పటికీ పనులు ముందుకు సాగలేదు. జగన్ హయాంలో చేపట్టిన నిర్మాణాలను తొలగించి, మాస్టర్‌ప్లాన్ ప్రకారం రూపొందించిన నమూనాను తీసుకురావడమే ప్రభుత్వానికి సవాలుగా మారింది. నాలుగు నెలలుగా అస్తవ్యస్త నిర్మాణాలను తొలగించడం, కార్యాలయం చుట్టూ ఉన్న ప్రాంగణాన్ని శుభ్రం చేయడానికే సమయం సరిపోతోంది. రాజధానిలో ఏర్పాటు చేస్తే అమరావతి నిర్మాణ పనులు మరింతగా పుంజుకుంటాయి. ప్రస్తుతం విజయవాడ నుంచి రాజధాని పనులను పర్యవేక్షించాల్సి వస్తోంది. దీంతో నిర్ణయాలు, వాటి అమలులో తెలియకుండానే జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తక్షణం కార్యాలయం అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉంది. అయితే పనులు మాత్రం అనుకున్నంత వేగంగా జరగడం లేదు. ముందుగా వేసిన అంచనాలను మించి అదనంగా వ్యయం చేయాల్సి వస్తోంది.


సీఆర్డీఏ కార్యాలయం పనుల నిమిత్తం తెచ్చిన రెడీ మిక్స్ యంత్రం

తాత్కాలిక ప్లాట్స్ కేటాయింపులో అక్రమాలు

- 50 శాతం ఆదాయం కోల్పోయిన మిర్చియార్డు
- విచారణ జరిపితే ఆదాయం పెరిగే అవకాశం

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో ప్రస్తుత సీజన్‌కు తాత్కాలిక ప్లాట్ల కేటాయింపులో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రికార్డుల్లో నమోదు చేసిన అద్దెల కంటే రెట్టింపు వసూలు చేశారన్న విషయం యార్డులో గుప్పుమంటున్నది. దీనివలన మార్కెట్ కమిటీకి రావాల్సిన ఆదాయానికి భారీగానే గండి పడింది. దాదాపుగా 86 ప్లాట్లను తాత్కాలిక ప్రాతిపదికన కమీషన్ వ్యాపారస్తులకు కేటాయించారు. ఒక్కో షాపు వైశాల్యం 400 నుంచి 800 చదరపు మీటర్ల వరకు ఉంది. ఒక్కో చదరపు మీటర్‌కు అధికారికంగా రూ. 25 మాత్రమే వసూలు చేసినట్లు రికార్డుల్లో చూపించారు. అయితే గుట్టుచప్పుడు కాకుండా రెట్టింపు మొత్తాన్ని వసూలు చేసి పంచేసుకొన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. దీనిపై విచారణ జరిగితే మరో కుంభకోణం వెలుగు చూసే అవకాశం ఉన్నది.

దాదాపుగా రూ.47 లక్షల వరకు ఆదాయం రావాలి

ఏటా మిర్చి సీజన్‌లో జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెల మొదటి వారం వరకు తాత్కాలిక ప్లాట్లను వ్యాపారస్తులకు కేటాయిస్తారు. సీజన్‌లో ఎక్కువ మొత్తంలో బిజినెస్ చేసే వ్యాపారస్తులు వీటిని తీసుకొంటారు. ఈ ప్లాట్ల కేటాయింపు బహిరంగ వేలం ద్వారా జరపాలి. అయితే ఈ దఫా గుట్టుచప్పుడు కాకుండా పూర్తి చేశారు. ఈ క్రమంలో పెద్దఎత్తున నగదు చేతులు మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో ప్లాటు సగటు విస్తీర్ణం 550 చదరపు మీటర్ల వంతున లెక్కిస్తే రూ. 13,750 ఆదాయం రావాలి. ఈ గణాంకాలను లెక్కిస్తే యార్డుకు దాదాపుగా రూ. 47 లక్షల వరకు ఆదాయం రావాల్సి ఉన్నది. అయితే ఇందులో సగం కూడా రాలేదని సమాచారం.

విజిలెన్స్‌కు ఫిర్యాదులు..

దీనిపై విజిలెన్స్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఇప్పటికే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సమగ్ర నివేదికని ప్రభుత్వానికి అందజేసింది. ఇప్పుడు నెలన్నర క్రితం జరిగిన మరో అవినీతిపై ఆరోపణలు రావడంతో మళ్లీ విచారణ జరిపే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ కూడా టెంపరరీ ప్లాట్ల కేటాయింపులో యార్డుకు జరిగిన నష్టంపై ఆరా తీస్తున్నది.

కృత్రిమ మేధపై పరిజ్ఞానం అవసరం

- వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నేటి సాంకేతిక యుగంలో ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతున్న కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ప్రయోజనాలు, ప్రమాదాలపై విద్యార్థులు విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సును శుక్రవారం నిర్వహించారు. సదస్సు ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య మాట్లాడుతూ ఈ సదస్సు విద్యార్థుల విజ్ఞానానికి ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. మైక్రోసాఫ్ట్ సంస్థకు చెందిన ఏఐ డేటా ప్రత్యేక ప్రతినిధి శేఖర్ రాజు మాట్లాడుతూ కృత్రిమ మేధను మానవ అద్భుతసృష్టిగా భావించేవారు కొందరైతే, సాంకేతిక సమస్యగా చూసే వారు కొందరని అన్నారు. క్వాడ్రెంట్ టెక్నాలజీస్ సేల్స్ మేనేజర్ ఆర్.రవి, మైక్రోసాఫ్ట్ టెక్ సేల్స్ సౌత్ ఇండియా ప్రతినిధి శ్రీకాంత్ కురూప్, అస్యూర్ సొల్యూషన్స్ ప్రత్యేక ప్రతినిధి అన్నుమాన్ అగర్వాల్, డాక్టర్ వేమూరి రవి, ఐమర్ సొసైటీ ఇండియన్ సర్వర్స్ సీఈవో డి.సాయిసతీష్ విద్యార్థులకు కృత్రిమ మేధకు సంబంధించిన అంశాలను తెలియజేశారు. ఈ వర్క్‌షాప్‌లో కంప్యూటర్ సైన్స్ ,ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకులు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ జి. నీలిమ, డాక్టర్ యు.సూర్య కామేశ్వరి, డాక్టర్ ఆర్.వసంత, పుష్పలత, బసవేశ్వరరావు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె. గంగాధరరావు

మోసగించిన వారికి అండగా ఉండొద్దు

- వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ సెక్రెటరి చంద్రిక


మిర్చి కమీషన్ వ్యాపారస్తులతో సమావేశమైన గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శిచంద్రిక

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులను మోసగించిన కమీషన్, ఎగుమతి వ్యాపారస్తులకు ఎవరూ అండగా నిలవొద్దని వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం ఏఎంసీ పరిపాలన భవనంలో కమీషన్ వ్యాపారస్తుల సంఘం నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రెటరీ చంద్రిక మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొంతమంది వ్యాపారస్తులు రైతుల మిర్చిని అమ్మేసి వారికి డబ్బులు చెల్లించకుండా బోర్డులు తిప్పేశారన్నారు. అలాంటి వారి లైసెన్సులను తాము నిలుపుదల చేశామని చెప్పారు. అయితే కొంతమంది వ్యాపారస్తులు వాళ్ల పేరుతో బిల్ టూ బిల్ వ్యాపారం చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో జాయింట్ కలెక్టర్ చాలా సీరియస్‌గా ఉన్నారని చెప్పారు. అలానే మిర్చి ధర పెరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం వేలం సమయంలో ఒక ధర, బిడ్డింగ్ అయిన తర్వాత మరో ధర ఇస్తామని చెప్పొద్దని, అలా చేస్తే సంబంధిత వ్యాపారిపై చర్యలు చేపడతామన్నారు. వ్యాపారస్తులు సిండికేట్ అయి ధర పెరగకుండా చేయాలని చూడొద్దని, రైతులకు న్యాయంగా రావాల్సిన ధర వచ్చేలా చూడాలన్నారు. మచ్చుకాయలు నేటికీ చాలామంది తీస్తున్నారని, దానిని పూర్తిగా అరికట్టాలన్నారు. యార్డులో ట్రాఫిక్ స్తంభించిపోకుండా అన్ని గేట్లు తెరిచామన్నారు. కొంతమంది ధూమపానం చేస్తున్నారని, అలాంటి వారిని నిరోధించాలన్నారు. తాము సోడా బంకులపై దాడులు నిర్వహించి సిగరెట్లు, అగ్గిపెట్టెలు, లైటర్లు సీజ్ చేశామన్నారు. సమావేశంలో స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీ సుబ్రహ్మణ్యం, మిర్చి కమీషన్ వ్యాపారస్తుల సంఘం నాయకులు దాది నరేంద్రబాబు, జంగా నర్సిరెడ్డి, ముక్కాల విజయభాస్కర్‌రెడ్డి, ఎల్.అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వారాంత రద్దీ దృష్ట్యా ఈ నెల 21, 22 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07025 చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు రైలు ఈ నెల 21వ తేదీన రాత్రి 9.15కి బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు మధ్యాహ్నం 12.15కి శ్రీకాకుళం రోడ్డుకు చేరుకొంటుంది. నంబరు 07026 శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి రైలు ఈ నెల 22వ తేదీన మధ్యాహ్నం 2.15కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

రూ.50 వేలకు మించి ఉండరాదు

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా సరైన ఆధారాలు లేకుండా ఎవరూ రూ.50 వేలకు మించి నగదు కలిగి ఉండరాదని రిటర్నింగ్ అధికారి ఎస్.నాగలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిమితికి మించి నగదు తీసుకొని వెళితే ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన కింద ఆ నగదుని జప్తు చేస్తామన్నారు. అలానే అనుమతి, ఆధారం లేకుండా బంగారం, వెండి వంటి ఆభరణాలు, ఎన్నికల ప్రచార సామగ్రి, ఓటర్లను ప్రలోభ పెట్టే ఏ ఇతర సామగ్రి రవాణ చేయరాదన్నారు. అలా చేస్తే వాహనాల అనుమతులు రద్దు చేసి కేసులు పెడతామని హెచ్చరించారు.

తపాలా శాఖను కాపాడుకోవాలి: పోస్టల్ జేఏసీ పిలుపు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖను ప్రైవేట్‌పరం కాకుండా సిబ్బంది కాపాడుకోవాలని పోస్టల్ జేఏసీ పిలుపు నిచ్చింది. శుక్రవారం నరసరావుపేట పట్టణం ప్రధాన తపాలా కార్యాలయం వద్ద పోస్టల్ శాఖలో ఏకపక్ష ధోరణితో తీసుకువస్తున్న నిర్ణయాలను, మార్పులను నిరసిస్తూ పోస్టల్ జేసీఏ ఆందోళన కార్యక్రమం నిర్వహించింది. ప్రైవేటైజేషన్ కాకుండా అడ్డుకోవటమే నినాదంగా అందరూ ఏకతాటిపై వచ్చి పోస్టల్ జేఏసీగా ఏర్పడి పరిరక్షణకు నడుము కట్టామన్నారు. విడతల వారీగా ఆందోళన కార్యక్రమంలో భాగంగా సాయంత్రం కార్యాలయం గేటు వద్ద ఈ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఉప్పలపాడులో వ్యక్తి ఆత్మహత్య

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడులో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జరిగింది. నరసరావుపేట రూరల్ ఎస్‌ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం ఉప్పలపాడుకు చెందిన తమ్మిశెట్టి కోటేశ్వరరావు (32) ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి, మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిషోర్ తెలిపారు.

ఎన్‌ఈసీలో ప్రారంభమైన వర్క్‌షాప్

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 14, (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఎన్‌ఈసీ కళాశాలకు చెందిన మెకానికల్ ఇంజనీరింగ్ రెండు, మూడు, నాలుగో సంవత్సరం విద్యార్థులు 115మంది ఈ ఏడాది మార్చిలో నిర్వహించే వివిధ పోటీల్లో పాల్గొనేందుకు సాంకేతికపరమైన శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్ శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్లు మిట్టపల్లి చక్రవర్తి రమేష్ బాబు, వెంకట కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూలుకు ఎన్‌సీసీ యూనిట్ మంజూరు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ స్కూల్‌కు ఎన్‌సీసీ సబ్ యూనిట్ మంజూరైనట్లు పాఠశాల ఛైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు తెలిపారు ఈ సందర్భంగా 23వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎంఎస్ పర్మార్, సుబేదార్ ముఖేష్‌కుమార్ జాట్ ఎన్‌సీసీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీఎం రామరాజు, ప్రిన్సిపాల్ అల్పన ఓనియల్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ భూపతి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వాసవి ఆలయ వార్షికోత్సవం

రొంపిచర్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్లలోని వాసవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. అమ్మవారికి పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి జరిగిన కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజల్లో ఆలయ ధర్మకర్త మద్ది రామచంద్రరరావు, మద్ది రామబ్రహ్మానందరావు, జి.వెంకటేశ్వర్లు, కొప్పు కోటయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు 15 మంది ఎంపిక

నాదెండ్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలోని కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. గత ఏడాది డిసెంబరులో ఈ ఉపకార వేతనాల ఎంపికకోసం పరీక్షలు నిర్వహించారు. మొత్తం 44మంది విద్యార్థులు హాజరుకాగా 15మంది ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలి: ఏవో

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) పొలం కలిగిన ప్రతి రైతు రైతు సేవా కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకోవాలని వినుకొండ మండల వ్యవసాయ అధికారి జి.వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు పొందాలంటే పేర్లు నమోదు తప్పనిసరన్నారు. రైతులు తమపరిధిలోని మీరైతు సేవా కేంద్రంలో, రైతులు రైతు పాస్ బుక్, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తదితర వివరాలను అందచేయాలన్నారు. పూర్తి వివరాలను మండల వ్యవసాయశాఖ అధికారి 8331056960లో సంప్రదించాలన్నారు.

● శావల్యాపురం, ఈపూరు: రైతులంతా రైతుసేవాకేంద్రాల్లో వీఏఏలను సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి, ఈపూరు మండల వ్యవసాయాధికారి రామినేని రామారావు శుక్రవారం తెలిపారు.

పేదలకు అన్నదానం

వినుకొండ, ఫిబ్రవరి 14. (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని విశ్రాంత ఉద్యోగులు సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పోట్లూరి కోటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి వరలక్ష్మి, కుమారుడు మురళి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సేవా సంఘం అధ్యక్షుడు భువనగిరి సుబ్రమణ్యం తెలిపారు. కార్యక్రమంలో అవ్వారు కోటేశ్వరరావు, వైవీ సుబ్బయ్య, దుబ్బల దాసు, వెంకటస్వామి, నారాయణరావు, శేషయ్య, రామలింగేశ్వరావు, ఎంవీ శర్మ, ఎస్ఎస్ఎం శాస్త్రి, హసన్, దీక్షతులు, శంకరరావు, కోటయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన భవనంలోకి యూబీఐ

ఈపూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఈపూరులో యూనియన్ బ్యాంకును శుక్రవారం కొత్తభవనంలో మార్చుతున్నట్లు మేనేజర్ ఎం.పార్థసారథి తెలిపారు. ఖాతాదారులకు అత్యాధునిక సాంకేతికపరమైన మెరుగైన సౌకర్యాలను అందించడానికి నూతన భవనాల్లోకి మార్పు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భవనాలను నరసరావుపేట మేనేజర్ టీ మాధురి ప్రారంభిస్తారన్నారు.

మాజీ సీఎం సంజీవయ్యకు ఘన నివాళి


దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు


సంజీవయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలోని గుర్రం జాషువా కల్యాణ మండపంలో కలెక్టర్ పి.అరుణ్‌బాబు దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి దామోదరం సంజీవయ్య చేసిన సేవలను కొనియాడారు. మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన సమయంలో రెండవ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా రెవిన్యూ అధికారి మురళి, రెవెన్యూ డివిజన్ అధికారులు మధులత, రమాకాంత్‌రెడ్డి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ జే వి సంతోష్, ఏ ఆర్ అదనపు ఎస్పీ వి సత్తిబాబు, ఏ ఆర్ డి ఎస్ పి మహాత్మా గాంధీ రెడ్డి, హోంగార్డు ఆర్ఐ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు

● చిలకలూరిపేట: పట్టణంలో పలుచోట్ల మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ డీఈఈ అబ్దుల్ రహీం, రెవెన్యూ ఆఫీసర్ పి.సుబ్బారావు, ఏఈ చల్లా శ్రీనివాసరావు, ఆర్ఐ షేక్ అబ్దుల్ ఖాదర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమణారావు సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం.రాధాకృష్ణ అధ్యక్షతన దామోదరం సంజీవయ్య జయంతిని నిర్వహించారు. గోరంట్ల నారాయణ, బొందు చినమస్తాన్ రావు, షేక్ బాజీ, సాతులూరి రవి, సాగీ నరసింహారావు, ఇంటూరి భవాని వెంకటేష్ పాల్గొన్నారు. చైత్రా సెంటర్‌లో గార్డ్ సంస్థ కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ దాసరి చిట్టిబాబు ఆధ్వర్యంలో సంజీవయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎక్సైజ్ సీఐ గోరంట్ల నారాయణ, ఉపాధ్యక్షులు గేరా యాకోబు, కాంగ్రెస్ నాయకులు ఎం.రాధాక్రిష్ణ, మాజీ కౌన్సిలర్ నాయుడు వాసు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

● వినుకొండ టౌన్: వినుకొండ నియోజక వర్గం మాల మహానాడు ఆధ్వర్యంలో మాజీ ముఖ్య మంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని శక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు కీర్తిపాటి వెంకటేశ్వర్లు, పమిడిపల్లి ఇజ్రాయిల్, కృపయ్య, బొందపాటి నాగేశ్వరరావు, బేతం దేవానంద్, పిడతల రాజా, రామయ్య, చిన్న, వెంకట్రావు, అంబడిపూడి శ్రీను , పల్లపాటి భాస్కర్, ఇశ్రాయేల్ తదితరులు పాల్గొన్నారు.

● తుమ్మలకుంట (శావల్యాపురం): ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని మండలంలోని కొత్తలూరు పంచాయతీ పరిదిలోని తుమ్మకుంట ప్రాథమిక పాఠశాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్టీయూ మండల కార్యదర్శి, హెచ్‌ఎం బిక్కా రాజారమేష్, ఎస్ఎంసీ ఛైర్మన్ మోషే, విద్యార్థులు, తల్లిదండ్రులు సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆలపాటికి మద్దతుగా కూటమి నేతల ప్రచారం


కూటమి నాయకులతో కలిసి ఆలపాటికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ శాసనమండలిలో నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావుల వాణిని బలంగా వినిపిస్తాడని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం ప్రచారం చేశారు. పట్టణంలోని శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డీఆర్ఎన్ఎస్‌సీవీఎస్ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటికి మద్దతుగా ప్రచారంచేసి ఆయనను ఎన్నికలలో గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఆలపాటిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తోట రాజా రమేష్, బీజేపీ నాయకులు జయరామిరెడ్డి, టీడీపీ నాయకులు తేళ్ల సుబ్బారావు, నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, మద్దుమాల రవి, మక్కెన నరసింహారావు, బేరింగ్ మౌలాలి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అరవిందబాబు ప్రచారం

నరసరావుపేట టౌన్, రొంపిచర్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, ప్రతిభావంతులు, మేధావులు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదుకు ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రైవేట్, ప్రభుత్వ, మునిసిపల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయులను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి ఉపాధ్యాయుల పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రొంపిచర్ల జడ్పీ స్కూల్ ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, గోనుగుంట్ల తదితరులు

● నూజెండ్ల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు విజయానికి మద్దతుగా మండల కేంద్రం నూజెండ్లలోని జడ్పీ పాఠశాల, మోడల్ స్కూల్‌లో శుక్రవారం కూటమి నాయకులు ప్రచారం చేశారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కోటపాటి జనార్ధనరావు, డీఎల్‌డీఏ మాజీ అధ్యక్షుడు లగడపాటి వెంకటరావు, త్రిపురాపురం డీసీ ఛైర్మన్ గంగినేని రాఘవ, గోవిందయ్య, రమేష్ తదితరులు ఉపాధ్యాయులను, పట్ట భద్రులను కలిసి కరపత్రాలను అందజేసి తొలి ప్రాధాన్యత ఓటును ఆలపాటి రాజేంద్ర ప్రసాదుకు వేసి గెలిపించాలని విజ్ఞపి చేశారు.

గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపును అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం నరసరావుపేట టీడీపీ జిల్లా కార్యాలయంలో ఈ నెల 2న జరగబోయే ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, తెలుగు మహిళ జిల్లా అధికార ప్రతినిధి దాసరి ఉదయశ్రీ, కుమ్మెత కోటిరెడ్డి, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కొమ్మాలపాటి శ్రీధర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ తదితరులు

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ కృషి అభినందనీయం: దాసరి

వినుకొండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కృషి అభినందనీయమని నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు అన్నారు. కోటేశ్వరరావు ఆధ్వర్యంలో డిగ్రీ కాలేజీ సమీపంలోని జగ్జీవన్‌రావు కాలనీలో పద్మశ్రీ అవార్డుకు మంద కృష్ణమాదిగ ఎంపికైన సందర్భంగా అభినందనలు తెలుపుతూ సభ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ కోసం సుమారు 30 సంవత్సరాల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దారివేముల సుబ్బయ్య. ఎస్సీ సెల్ అధ్యక్షుడు గర్నిపూడి ఈశ్వరయ్య, గుంజరి పున్నయ్య, కట్టెంపూడి బర్ల, దోరట్ల మన్నిబాబు, సంపెంగుల పెద్ద నరసయ్య, ట్రాలీ లింగయ్య, సంపెంగుల ప్రసాద్, సంపెంగుల శివ, దాసరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో టైనీటాట్స్ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాలలో టైనీటాట్స్ ఐఐటీ ఫౌండేషన్ విద్యార్థులు ప్రతిభ చాటరని పాఠశాల డైరెక్టర్ పాతూరి భానుతేజ అన్నారు. శుక్రవారం పాఠశాల మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భానుతేజ మాట్లాడుతూ ఫౌండేషన్ విద్యార్థులు 15 మంది 99 పర్సంటైల్ సాధించారన్నారు. 28మంది 90 పర్సంటైల్ పైగా సాధించారని తెలిపారు. ఫిజిక్స్‌లో లక్ష్మీలాస్య, స్రవంత్ నూటికి నూరు మార్కులు సాధించారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ పాతూరి శ్రీనివాసరావు, కోటయ్య, కరణం కొండలరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్ఎస్ఎన్ కళాశాలను సందర్శించిన కమాండింగ్ ఆఫీసర్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలను చీరాల 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్ఎస్ పారమార్ శుక్రవారం సందర్శించారు. కల్నల్ ఎస్ఎస్ పారమార్‌కు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాససాయి, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బీఎస్ఆర్‌కు రాజు, ఎన్‌సీసీ క్యాడెట్స్ ఘనంగా స్వాగతం పలికారు. పారమార్‌ను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ ఆఫీసర్, ఎన్‌సీసీ క్యాడెట్స్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుబేదార్ ముకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ పై అవగాహన

నరసరావుపేట లీగల్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ ప్రభావం మన జిల్లాలో లేదని పల్నాడు జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ కే కాంతారావు తెలిపారు. బర్డ్ ఫ్లూపై వ్యాధి, లక్షణాలు తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు.

అచ్చయ్యపాలెం ఉప సర్పంచ్ కోటయ్య రాజీనామా

రొంపిచర్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజోతి): మండలంలోని అచ్చయ్యంపాలెం గ్రామ ఉప సర్పంచ్ పదవికి మేకల బాల కోటయ్య శుక్రవారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఈ పదవికి రాజీనామా చేస్తున్నట్టు లేఖను మండల పరిషత్ అధికారులకు అందజేశారు. రాజీలో భాగంగా జరిగినట్టు తెలియవచ్చింది. 7వ వార్డు సభ్యుడు గాడిపర్తి సత్యనారాయణకు ఉప సర్పంచ్ పదవి దక్కే అవకాశం ఉంది.

జొన్నలగడ్డ వద్ద ఆర్‌యూబీని ఏర్పాటు చేయరూ...

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం జొన్నలగడ్డ వద్ద గుంటూరు-గుంతకల్ రైల్వే లైన్‌లో నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జితో పాటు రెండవ ఆర్‌యూబీ నిర్మించాలని రైతులు కోరారు. శుక్రవారం ఆర్‌యూబీ పరిశీలనకు డీఈఎన్ భరత్‌కుమార్ మరో రైల్వే అధికారి శ్రీనివాసరావు జొన్నగడ్డకు వచ్చారు. ఈ సందర్భంగా జొన్నలగడ్డ రైతులు రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేశారు. రెండవ ఆర్‌యూబీ తొమ్మిది అడుగుల ఎత్తు, తొమ్మిది అడుగుల వెడల్పులో నిర్మించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని గతంలోనే రైతులు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు దృష్టికి తీసుకువెళ్ళారు. కార్యక్రమంలో యర్రం వెంకటేశ్వర్లు, నల్లపాటి రామారావు, నల్లపాటి సుబ్బయ్య, ఏడుకొండలు, నడిపినేని ఆంజనేయులు, శంభులింగం, ఎం.సాంబశివారెడ్డి, కొరిటాల చిన ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలం లోని లింగంగుంట్లలోని శంకర భారతీపురం హైస్కూల్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ పడాయి భీ కార్యక్రమంపై మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి తెలిపారు. నరసరావుపేట మండలంలోని 40 మంది కార్యకర్తలకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా శిక్షకులు మేరీ జోష్నగోల్డ్, ఎస్‌కే గౌస్య పిల్లల పెరుగుదల, పర్యవేక్షణ, వెయ్యి రోజుల సంరక్షణ, పిల్లలకు ఇవ్వవలసిన ఆహారం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, రెడ్డిపాలెం గ్రామాల్లో జడ్పీ పాఠశాలల్లో అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ తరగతులు శుక్రవారం కూడా జరిగాయి. ఆయా కేంద్రాల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాల గురించి సూపర్ వైజర్లు శశిదేవి, దేవీబాయి, షహీమ్ సుల్తానాలు వివరించారు.

● శావల్యాపురం: స్థానిక జడ్పీ పాఠశాలలో పోషణ్ భీ పడాయి భీ అనే అంశంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలక్ష్మి శిక్షణ ఇచ్చారు. ప్రతిరోజూ మొలకెత్తిన విత్తనాలు, ఆకుకూరలు, పాలు, కోడిగుడ్డు, పండ్లు తినడం వల్ల ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారని తెలిపారు.

బాధితులకు న్యాయం చేయండి

ఎస్పీకి సాయిసాధన చిట్‌ఫండ్ బాధిత ప్రతినిధుల వినతి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చిట్‌లు.. డిపాజిట్‌లు చేసి మోసపోయిన సాయిసాధన చిట్‌ఫండ్ బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావును కోరారు. బాధితుల తరపున ప్రతినిధులు శుక్రవారం ఎస్పీని కార్యాలయంలో కలిశారు. పథకం ప్రకారం పాలడుగు పుల్లారావు వందలాది మందిని మోసగించాడని వారు ఎస్పీకి వివరించారు. మోసం జరిగిన తీరు తెలియజేశారు. డిపాజిట్‌లు సేకరించడంతో పాటు.. చిట్ సభ్యులు చెల్లించిన మొత్తాలను కూడా పక్కదారి పట్టించాడన్నారు. పుల్లారావు, ఆయన కుటుంబ సభ్యుల పేర్లపై ఆస్తులతో పాటు రూ.కోట్లు విలువ చేసే బంగారం, వెండి, డైమండ్స్ ఉన్నాయని వివరించారు. త్వరితగతిన కేసు విచారించి బాధితులందరికీ న్యాయం చేయాలని కోరారు. పుల్లారావుపై నమోదుచేసిన కేసుల విచారణ జరుగుతోందని ఎస్పీ తెలిపారు. అయితే ఈ కేసును సీఐడీకి బదిలీ చేసే అవకాశం ఉందని, అప్పుడే దర్యాప్తు వేగవంతం అవుతుందని ఎస్పీ వెల్లడించినట్లు ఆయనను కలిసిన వారు తెలిపారు. బాధితుల ప్రతినిధులుగా నాగోతు శౌరయ్య, కడియాల రమేష్, న్యాయవాది సేజే ప్రతాప్, చావా వీరేశ్వరరావు, అయినవోలు రాధాకృష్ణమూర్తి యామని రామారావులు ఎస్పీని కలసిన వారిలో ఉన్నారు.

సురేష్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

రొంపిచర్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల గ్రామానికి చెందిన చెరుకూరి సురేష్ జనవరి 31వ తేదీన ఐర్లాండ్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా శుక్రవారం అతని మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా చెరుకూరి సురేష్ మృతదేహానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

గోనుగుంట్ల నివాళి

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు సురేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.


రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

పాఠశాలలో డీఈవో ఆకస్మిక తనిఖీ

రొంపిచర్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్ల, గోగులపాడు గ్రామాల్లోని జడ్పీ పాఠశాలలను డీఈవో చంద్రకళ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. సబ్జెక్టులలో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ నెల 15వ తేదీన జరిగే సమావేశాలకు ప్రతి ఉపాధ్యాయుడు హాజరు కావాలన్నారు. ఆమె వెంట డీఈవో బ్రహ్మేశ్వరరావు ఉన్నారు.


దేవాలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న రామిరెడ్డి తదితరులు

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

● గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అన్నారు. చిరుమామిళ్ళలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి, ఎస్టీ కాలనీలోని శివాలయంలో వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ప్రదక్షణలు చేసి స్వామివార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు డాక్టర్ సిరిపురపు అప్పారావు, వై శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అప్పిరెడ్డి, భవనం శ్రీనివాసరెడ్డి, హరికృష్ణ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


కనపర్రు నైస్ స్కూలులో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న రోటరీ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి

రోటరీ 3150 జిల్లా గవర్నర్ పర్యటన

చిలకలూరిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రోటరీ 3150 జిల్లా గవర్నర్ కె.శరత్‌చౌదరి స్థానిక పండరీపురం రోటరీ క్లబ్‌కు శుక్రవారం అధికార పర్యటనపై విచ్చేశారు. క్లబ్ సభ్యులతో సమావేశమై పర్యావరణ పరిరక్షణలో భాగంగా క్లబ్ ద్వారా ఇప్పటివరకు 25వేల క్లాత్ బ్యాగ్స్ ఉచితంగా పంపిణీ చేయటంపై అభినందించారు. రాజాపేటలోని గురుకుల పాఠశాలలో హైదరాబాద్ దక్కన్ క్లబ్ వారి సహకారంతో నిర్మించిన ఆర్వో ప్లాంట్ ఈ నెల 18న ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. దత్తత గ్రామమైన తుర్లపాడులో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయటానికి సన్నాహాలు చేస్తున్నట్టు కూడా తెలిపారు. అనంతరం మార్టూరులోని శారదానికేతన్, కనపర్రులోని నైస్ పాఠశాలలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. తుర్లపాడులో గ్రామస్థులతో సభ నిర్వహించారు. క్లబ్ ద్వారా చెక్ డ్యాంలు నిర్మించాలని గ్రామస్థులు సభలో కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ కొల్లా శ్రీనివాసరావు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వారణాశి శరత్‌శాస్త్రి, కొల్లా వెంకటసుబ్బారావు, కోశాధికారి జంపని శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు చెంచుపున్నయ్య, లింగయ్య చౌదరి, సింగారావు, ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో 8,718 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, కృష్ణా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 8,718 మంది ఓటర్లు ఉన్నారు. చిలకలూరిపేట పట్టణ పరిధిలో 4,753మంది, చిలకలూరిపేట మండలంలో 1,298 మంది, యడ్లపాడు మండల పరిధిలో 1,077 మంది, నాదెండ్ల మండల పరిధిలో 1,590 మంది గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదయ్యారు. ఈ నెల 27న జరగనున్న ఎన్నికల కోసం మొత్తం11 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. చిలకలూరిపేట పట్టణం, మండలంలోని ఓటర్లకు పట్టణంలోని ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్, శారద హైస్కూల్‌లో 7పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. యడ్లపాడులోని లూథరన్ హై స్కూల్లో రెండు, నాదెండ్లలోని జడ్పీ హైస్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.